

బతుకమ్మ సందడి : బెంగళూరు నగర పరిధి వర్తూరులో తెలంగాణ సాంస్కృతిక పండగ 'బతుకమ్మ' ఉత్సవాలు బుధవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వర్తూరు 'బ్రిగేడ్ ఉటోపియా' ఆవరణలో వివిధ రకాల పూలతో బతుకమ్మను పూజించిన భక్తులు వచ్చిన సంప్రదాయ పాటలు ఆలపించిన వేళ.. భక్తుల బృందచిత్రమిలా.. **(న్యూస్‌టుడే, యశ్వంతపుర)**

ఇన్‌స్టా ప్రేమ.. చిక్కుల్లో భామ

కలబురగి, న్యూస్‌టుడే : ఇన్‌స్టాగ్రామ్‌లో ఐదు నెలల కిందట పరిచయమైన హైదరాబాద్ యువతి (24) ఇచ్చిన ఫిర్యాదుతో యల్లాలింగ (28) అనే కేఎస్ఆర్‌పీ కానిస్టేబుల్ చిక్కుల్లో పడ్డాడు. ఆయనపై కర్ణాటకలోని కలబురగి నగర మహిళా ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఇద్దరికి పరిచయం ఏర్పడింది. ఇద్దరూ సెల్‌ఫోన్ నెంబర్లు ఇచ్చిపుచ్చుకున్నారు. అప్పటి నుంచి ఫోన్‌లో మాట్లాడుకుంటూ ఉల్లాసంగా గడిపారు. నిన్ను వివాహం చేసుకుంటానని ఆమెను నమ్మించి, హైదరాబాద్ నుంచి కలబురగికి ఆగస్టు 13న పిలిపించుకున్నాడు. ఆమెను బస్టాండ్ సమీపంలోని ఒక లాడ్జిలో ఉంచాడు. వివాహం చేసుకుంటున్నాం కదా అని అంటూనే ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించాడు. వాంఛలన్నీ తీర్చుకున్నాడు. మళ్లీ తొంగిచూడలేదు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. ఇప్పుడు తాను వివాహం చేసుకునేందుకు తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని, కట్నం ఇస్తేనే వివాహం చేసుకుంటానని చెప్పడంతో ఆమె కంగుతింది. ఆమె బుధవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

మహాత్ముడే మార్గదర్శి



'గాంధీ నడక' కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మహాత్మా గాంధీ 155వ జయంతితో పాటు బెళగావి కాంగ్రెస్ ప్లీనరీకి బాపూజీ అధ్యక్షత వహించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు 'గాంధీ నడక' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు కుమారకృప రహదారిలో ఉన్న గాంధీ భవన్‌కు చేరుకుని, బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారంతా గాంధీ టోపీలు ధరించి నడక కార్యక్రమాన్ని చేపట్టారు. జాతీయ జెండాలు, బాపూజీ చిత్రపటాలతో అందరూ ముందడుగు వేయగా.. డీకే శివకుమార్ కాగడా ప్రదర్శిస్తూ ముందుకు సాగారు.



విధానసౌధ గాంధీ విగ్రహం వద్ద సిద్ధరామయ్య, డీకే తదితరులు

అలా.. విధానసౌధ సమీప గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని పుష్పార్చన చేశారు. మంత్రులు హెచ్.కె.పాటిల్, డాక్టర్ పరమేశ్వర్, ప్రియాంక్ ఖర్గే, లక్ష్మీ హెబ్బాళ్కర్, కేంద్ర మాజీ మంత్రి వీరప్పమొయిలీ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధుకు తప్పిన ముప్పు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : విధానసౌధ సమీపాన బుధవారం ఉదయం కిత్తూరు రాణి చెన్నమ్మ విజయోత్సవ జ్యోతి వెలిగించిన సమయంలో.. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చొక్కాకు మంటలు సోకాయి. భద్రత సిబ్బంది తక్షణమే అప్రమత్తమై నిప్పు ఆర్పేశారు. ఆ క్రమంలో కాసేపు ఆందోళనకర వాతావరణం నెలకొంది. సౌధ ముంగిట బెళగావి జిల్లాధికారులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దీపం మంట సెగ పొడవాటి



విధానసౌధ సమీపాన రాణి చెన్నమ్మ విజయోత్సవ జ్యోతి వెలిగించిన సిద్ధరామయ్య తదితరులు

ఆయన చొక్కాను తాకినా.. అప్రమత్తం కావడంతో ముప్పుతప్పింది.

● దేశభక్తికి మారుపేరు రాణి చెన్నమ్మ అని ఇదే సందర్భంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. ఆమె పేరిట ఆరంభించిన 'విజయజ్యోతి' అన్ని జిల్లాలనూ చుట్టేస్తుందని వివరించారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన వీర మహిళ ఆమేనని, సంగొళ్లి రాయణ్ణ సైన్యాధికారిగా చక్కని సేవలు అందించారని గుర్తు చేశారు. బ్రిటిష్ పాలకులపై వీరోచిత పోరాటం చేశారని వివరించారు. దేశభక్తికి మారుపేరు రాణి చెన్నమ్మ అని కీర్తించారు. కిత్తూరు అభివృద్ధికి ప్రభుత్వం శ్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు లక్ష్మీ హెబ్బాళ్కర్, హెచ్.కె.పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



రాజవీధి : కిత్తూరు రాణి చెన్నమ్మ వేడుకల వేళ బెంగళూరు విధానసౌధ ముంగిట ఓ కళాకారిణి విన్యాసమిలా..

ముడా సుడిగుండాలు

● ఈడీ కేసు.. 'స్నేహమయి'కి తాఖీదు

● ముఖ్యమంత్రి కుటుంబానికీ ఇక ఇక్కట్లే



సిద్ధరామయ్య.. కష్టకాలం

ఈనాడు, బెంగళూరు : అక్రమ వ్యవహారాల్లో లెక్కకు అందని నగదు ఆటకట్టించే ఈడీ(ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) కేసులో ఆట మొదలుపెట్టింది. ఈ సంస్థ గతనెల 30న ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు ఇన్‌ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) నమోదు చేసినట్లు జాతీయ మాధ్యమాలు వెల్లడించినా.. అధికారిక పత్రాలేవీ రాష్ట్రానికి చేరలేదు. ముడా కేసులో నిందితులుగా గుర్తించిన వారెవరికీ ఈడీ నుంచి అధికారిక నోటీసులు అందలేదు. చివరకు ముడా కార్యాలయానికి దీనిపై సమాచారం లేకున్నా.. వివాదాన్ని తెరపైకి తెచ్చిన ఫిర్యాదుదారుడు స్నేహమయి కృష్ణకు బుధవారం ఈడీ నుంచి ఓ మెయిల్ వచ్చింది. ఈసీఐఆర్‌లో భాగంగా ఈ కేసుకు సంబంధించిన దాఖలాలు సమర్పించాలన్నదే ఆ మెయిల్ సారాంశం. స్నేహమయి కృష్ణ ఈ కేసులో నిందితుల జాబితాలో లేకున్నా.. దర్యాప్తునకు సహకరించాల్సిన కీలక వ్యక్తుల్లో ఒకరు. మరోవైపు లోకాయుక్త మొదలుపెట్టిన దర్యాప్తులోనూ స్నేహమయి కృష్ణనే పోలీసులు వాకబు చేయటం గమనార్హం. వివాదిత కెసరె గ్రామంలో మహజరు ప్రక్రియలో స్నేహమయి కృష్ణ పాల్గొన్న విషయం తెలిసిందే.

ఆందోళన షురూ..



స్నేహమయి కృష్ణ

లోకాయుక్త దర్యాప్తుకంటే ఈడీ రంగప్రవేశమే ముడా కేసును ఆసక్తిగా మలిచింది. నగదు బదిలీకి అవకాశమే లేని వ్యవహారంలో ఈడీ జోక్యం ఏమిటని ముఖ్యమంత్రితో పాటు మంత్రివర్యులు ప్రశ్నిస్తుండగా. . కొందరు విశ్రాంత న్యాయవాదులు ఇదే అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈడీ ప్రవేశమే ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులను ఆందోళనకు గురి చేసింది. వాస్తవానికి ముఖ్యమంత్రి సతీమణి పార్వతి వివాదాస్పద స్థలాలను తిరిగి ఇచ్చిందే ఈడీ విచారణకు భయపడి అన్న వాదన వినిపిస్తోంది. ఈడీ కేసు నమోదు చేస్తే రానున్న ఆరు నెలల పాటు వారి ఆస్తులను జప్తు చేస్తారు. ఈ కారణంగానే 14 స్థలాలను తిరిగి ఇచ్చారని సమాచారం. స్వయంగా న్యాయవాది అయిన ముఖ్యమంత్రి, మెరికల్లాంటి నిపుణుల బృందం తోడుగా ఉండగా ఈ కేసులో ప్రతి అడుగూ ఆలోచించే వేస్తారని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇదే సందర్భంగా ఓ వైపు కోర్టు సూచనతో కేసు నమోదైన దశలో స్థలాలు తిరిగి ఇవ్వటంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇంత వరకు ఈడీ కేసు నమోదు చేసినా నోటీసులు జారీ చేయకపోవటంతో ఊపిరి పీల్చుకున్న నిందితులకు స్నేహమయి కృష్ణకు వచ్చిన మెయిల్ సమాచారంతో ఆందోళన మొదలైంది. ఏ క్షణంలోనైనా నిందితులకు నోటీసులు వచ్చే వీలుంది.

అంతుచిక్కని ఎత్తుగడ..

ముడా అక్రమాలపై ఇంత వరకు హైకోర్టు, ప్రజా ప్రతినిధుల కోర్టు, లోకాయుక్త, ఈడీలు ప్రవేశించినా. . ముఖ్యమంత్రి ఇప్పటి వరకు తన న్యాయపోరాటం ఎలా ఉండబోతుందో బహిరంగపరచలేదు. ప్రస్తుతం ముఖ్యమంత్రి ముందు ఎన్నో న్యాయ సంబంధ ఐచ్ఛికాలున్నాయి. ఇందులో ఓ వైపు లోకాయుక్త, మరోవైపు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ముడా అక్రమాలపై దర్యాప్తు మొదలైంది. ఓ సంస్థ దర్యాప్తు చేపడుతుండగా మరొక సంస్థ విచారణ చేయకూడదన్న వాదన వినిపిస్తోంది. ఈ ప్రక్రియను సవాలు చేస్తూ ముఖ్యమంత్రి హైకోర్టుకు వెళ్లొచ్చు. తనపై నమోదైన కేసును ఉపసంహరించుకోవాలని పిటిషన్ వేసే వీలుంది. నమోదైన కేసుల్లో కొన్ని బెయిల్ రహిత యాక్టులున్నాయి. వీటి నుంచి తప్పించుకునేందుకు ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేయొచ్చు. వీటిల్లో ఏ ఒక్క చర్యకూ ఇప్పటిదాకా ముఖ్యమంత్రి సిద్ధం కాలేదు. అసలు ఈ వ్యవహారంలో ఏం చేయబోతున్నదీ నిగూఢమే.

మనస్సాక్షిని నమ్ముతున్నారా..

తప్పు చేయలేదని పదేపదే చెబుతున్న ముఖ్యమంత్రి.. పదవికి రాజీనామా చేయాల్సిన అవసరం లేదంటున్నారు. 2011లోనూ తనపై ఆరోపణలు రావటంతో అందుకు కారణమైన స్థలాలను తిరిగి ఇచ్చిన అప్పటి ముఖ్యమంత్రి యడియూరప్ప తీరును ప్రశ్నించిన ఇదే సిద్ధరామయ్య ఆ సంఘటన వేరని సమర్థించుకుంటున్నారు. తాను ముడా కేసులో ఎలాంటి ఆదేశాలు, రాతపూర్వక వ్యవహారాలు నడపలేదన్నారు. డీనోటిఫికేషన్ చేయలేదన్నారు. యడియూరప్ప నేరుగా అప్పటి ఆరోపణకు కారణమయ్యారన్నారు.

పార్వతి పేరిట ఖాతా రద్దు

మైసూరు: మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) వ్యవహారం మరో చర్చకు తావిచ్చింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతి తనకు వచ్చిన 14 ఇళ్ల స్థలాలను వెనక్కు తిరిగి ఇవ్వడంతో ఒప్పంద పత్రాన్ని రద్దు చేశామని ముడా కమిషనర్ రఘునందన్ తెలిపారు. ఆమె నుంచి స్వాధీనపరుచుకున్న భూమికి ఇళ్ల స్థలాలను ఎక్కడ కేటాయించాలో న్యాయకోవిదులతో చర్చిస్తున్నామని ఆయన చెప్పారు.

నకిలీ దాఖలాలతో పాకిస్థానీ పాగా

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : జిగణిలో అరెస్టయిన పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తి, అతని భార్య, ఇద్దరు పిల్లలపై విచారణను పోలీసులు కొనసాగించారని నగర పోలీసు కమిషనర్ దయానంద్ తెలిపారు. నిందితుడి వద్ద పాస్‌పోర్టు, ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డులు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తే.. అవి నకిలీవేనని తేలిందన్నారు. కేంద్ర నిఘా వర్గాల సహకారంతో విచారణ కొనసాగుతున్నట్లు వివరించారు. మరోవైపు.. గత నెల 24న జిగణిలో అరెస్టు చేసిన గిరీశ్ బోరా విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ కొనసాగించింది. అతను అసోంలోని లఖీంపుర జిల్లాలో దాచి పెట్టిన ఐఈడీని జప్తు చేసుకుని, దాన్ని నిష్క్రియం చేశారని కొత్వాలు తెలిపారు.

దావణగెరెలో..

దావణగెరె, న్యూస్‌టుడే : హిందువుల పేర్లు పెట్టుకుని దావణగెరెలో ఉంటున్న ఆరుగురు పాకిస్థాన్ జాతీయులను బెంగళూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. బెంగళూరు శివారు ప్రాంతం జిగణిలో అరెస్టైన పాక్ జాతీయుడు రషీద్ సిద్ధికి నుంచి సేకరించిన సమాచారంతో పోలీసులు బుధవారం ఇక్కడ దాడులు నిర్వహించారు. దావణగెరె కుమారస్వామి లేఅవుట్‌లో ఉంటున్న మహ్మద్ హనీఫ్, అతని భార్య రుబీనా, వారి కుమారుడు మహ్మద్ యాసిన్, కుమార్తె ఫాతిమా, కోడలు జైనాబి నూర్, అల్లుడు అల్తాఫ్‌ని అరెస్టు చేశారు. పేర్లు మార్చుకుని, అవే పేర్లతో ఆధారాలను సృష్టించుకున్నారని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.



ఫిరంగులు పేల్చుతున్నప్పుడు నింపాదిగా నిలుచున్న ఏనుగులు

దసరా.. విజయఢంకా!

నేటి నుంచే మైసూరు సంబరాలకు శ్రీకారం

మైసూరు, న్యూస్‌టుడే : సాంస్కృతిక నగరి మైసూరులో గురువారం నుంచి విశ్వ విఖ్యాత దసరా ఉత్సవాల ప్రారంభ ఢంకా మోగించనున్నారు. చాముండి బెట్టపై ఉదయం 9.15కే ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో కలిసి సీనియరు సాహితీవేత్త హంప నాగరాజయ్య అమ్మవారికి పూజలు చేసి నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు మహదేవప్ప, కె.వెంకటేశ్, ఎమ్మెల్యేలు, మేయరు, పాలికె కార్పొరేటర్లు పాల్గొంటారు. రెండంచెల్లో భద్రతను కల్పిస్తున్నామని నగర పోలీసు కమిషనర్ సీమా లాట్కర్, ఎస్పీ విష్ణువర్ధన్ తెలిపారు. నిఘా కోసం 13,670 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కొన్ని కూడళ్లలో వాచ్ టవర్లు నిర్మించారు. నగరంలోని పారంపరిక భవంతులను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. రానున్న 21 రోజుల పాటు విద్యుత్తు దీపాల అలంకరణను కొనసాగించనున్నారు. ప్యాలెస్‌తో పాటు 100కు పైగా కూడళ్లలో విద్యుత్తు దీపాలను అమర్చారు. ఉత్సవాలు పూర్తయిన అనంతరమూ ఈ దీపాలంకరణను కొనసాగించడం ఇదే మొదటిసారి. ఏనుగులన్నీ తాలీము పూర్తి చేసుకున్నాయి. నవరాత్రుల్లో చివరి రోజు జంబూ సవారీని నిర్వహించేందుకు వచ్చిన ఏనుగులు అప్పటి వరకు తాలీముకు తీసుకువెళ్లనున్నారు. చలన చిత్రోత్సవాలు, ఆహార మేళా, వస్తు ప్రదర్శన, కుస్తీ పోటీలు, ఫలపుష్ప ప్రదర్శనలను వీక్షించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపిస్తారు. టాంగా సవారీ, బస్సు టాప్‌పై కూర్చుని నగర ప్రదక్షిణ, బృందావన్ గార్డెన్స్, జంతుప్రదర్శనశాల, చాముండి బెట్ట. . మైసూరు ప్రత్యేకతలు. ఇక్కడికి సమీపంలోని నంజనగూడు, శ్రీరంగపట్టణ, మంగళూరు, కొడగుల్లో నిర్వహించే దసరా వేడుకలకు హాజరయ్యేందుకు బెంగళూరుతో పాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా బస్సులను రవాణాశాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. నంజనగూడు రసబాళె (అరటి), మైసూరు తమలపాకులు, మల్లెలు, మైసూరుపాక్.. ఈసారి ఎక్కువ సంఖ్యలో విక్రయం అవుతాయని వ్యాపారులు ధీమాతో ఉన్నారు. నగరంలో ఉంటున్న వారి ఇళ్లకు బంధువులు పోటెత్తుతున్నారు. హోటళ్లు, హోం స్టేలు ఇప్పటికే నిండిపోయాయి.



చాముండీ మాతను వేడుకలకు తీర్చిదిద్దుతున్న వేదపండితుడు

ఈసారి.. కొత్త సంకటం ఎవరికో?

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : అత్యాచారం ఆరోపణలపై అరెస్టయిన భాజపా ఎమ్మెల్యే, మాజీ మంత్రి మునిరత్న నివాసం నుంచి జప్తు చేసుకున్న ల్యాప్‌టాప్, పెన్‌డ్రైవ్‌లలో పలువురు నాయకుల ప్రైవేటు వీడియోలు ఉన్నాయని ప్రత్యేక దర్యాప్తు దళం (సిట్) అధికారులు గుర్తించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ముడా, మంత్రి పదవిని కోల్పోయిన బి.నాగేంద్ర వాల్మీకి కార్పొరేషన్ కుంభకోణంతో తలనొప్పులను ఎదుర్కొంటుండగా, ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌పై ఈడీ, సీబీఐ కేసులు, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పపై పోక్సో కేసు, హెచ్‌డీ కుమారస్వామి డీనోటిఫికేషన్ కేసును ఎదుర్కొంటున్నారు. విపక్ష నేత ఆర్ అశోక్ డీనోటిఫికేషన్ చేసిన ఆరోపణలు వచ్చాయని శివకుమార్ తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ సుధాకర్ కరోనా మహమ్మారి సమయంలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే సమయంలో భాజపా నాయకుల వ్యక్తిగత వీడియోలు మునిరత్నకు చెందిన ల్యాప్‌టాప్, పెన్‌డ్రైవ్‌లో ఉన్నాయని బయటకు పొక్కడంతో నాయకుల్లో భయం మొదలైంది. ఒక మాజీ ముఖ్యమంత్రి (భాజపా), ఆయన మంత్రివర్గ సభ్యుడు నందిబెట్టపైకి వెళ్లి రాసలీలలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. కమలదళంలో సీనియర్ నేతలు యత్నాళ్, రమేశ్ జార్ఖిహొళి తదితరులు వేరు కుంపటి పెట్టుకున్నట్లు వార్తలందుతున్నాయి. సిద్ధరామయ్య తప్పుచేసినట్లు చూపించేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఆ పార్టీ ఎమ్మెల్యే ఎస్టీ సోమశేఖర్ వ్యాఖ్యానించారు. ఆరోపణలు, కేసులు, ప్రత్యారోపణలు, వీడియోలు వీటన్నిటితో కర్ణాటకలో రాజకీయాలు రసపట్టుకు చేరుకున్నాయని విశ్లేషకుల మదింపు.



మునిరత్న

పెళ్లి చేసుకోమంటే.. ఉరి బిగించుకున్నాడు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : తన స్నేహితురాలు, బుల్లితెర నటి వీణ నివాసంలో ఆమె స్నేహితుడు మదన్ (24) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కోణనకుంటె సమీపంలోని పిళ్లగానహళ్లికి చెందిన మదన్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీని నిర్వహించేవాడు. సాగరకు చెందిన వీణ బన్నేరుఘట్ట రోడ్డు సీకేపాళ్య సమీపంలోని మండి లేఅవుట్‌లో బాడుగ ఇంట్లో ఉండేది. ఆమెకు మదన్, పునీత్ ఇద్దరూ స్నేహితులు. మొదట పునీత్‌తో ఆమె సన్నిహితంగా ఉండేది. అతనితో గొడవ పడి, మదన్‌కు చేరువైంది. కొద్ది రోజులుగా సహజీవనం చేస్తున్నారు. వివాహం చేసుకోవాలని ఆమె ఒత్తిడి చేస్తుండగా.. మదన్ వాయిదా వేస్తూ వచ్చాడని పోలీసులు వివరించారు. ఇద్దరూ మంగళవారం రాత్రి ఏడు బ్రీజర్లు కలిసి తాగారని గుర్తించారు. మళ్లీ వివాహం విషయం రాగా.. ఇద్దరూ గొడవ పడ్డారని తెలిపారు. మదన్ ఆవేశంతో పక్కనే ఉన్న గదిలోకి వెళ్లి ఉరి వేసుకున్నాడని తెలిపారు. హుళిమావు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్వచ్ఛపతాక రెపరెపలు

వాడవాడలా గాంధీజీ నామస్మరణ



వీధిని శుభ్రం చేస్తున్న భాజపా రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్ర, ఎంపీ పీసీ మోహన్

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : జాతిపిత జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పార్టీల నేతలు, గాంధేయవాదులు స్వచ్ఛ సేవలు ప్రారంభించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇద్దరూ వేర్వేరు కార్యక్రమాల్లో సందడి చేయగా.. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి హెచ్ఎంటీ పరిశ్రమ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వీధుల్ని శుభ్రం చేశారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, భాజపా రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర, ఎంపీ పీసీ మోహన్, ఎమ్మెల్సీ రవికుమార్ తదితరులు పార్టీ కార్యాలయంలో మహాత్ముడు, శాస్త్రి చిత్రపటాలకు నివాళి అర్పించారు. స్థానిక వీధులను శుభ్రం చేశారు. ఖద్దరు వస్త్రాలను కొనుగోలు చేశారు. కేజీఎఫ్ ఎస్పీ ఆఫీసులో నిర్వహించిన కార్యక్రమాన్ని ఎస్పీ శాంతరాజ్ ప్రారంభించారు. ముళబాగిలు తాలూకా ఉత్తనూరు పాఠశాలలో నిర్వహించిన గాంధీజయంతి వేడుకలను సామాజిక కార్యకర్త శ్రీనివాస్ ప్రారంభించారు. పెరు రాయబారి సీవీ విక్రమ్ విశ్వనాథ అయ్యర్ విద్యార్థులకు పంపించిన బోధనా పరికరాలను ఆయన పంపిణీ చేశారు. కోలారు జిల్లా సోమేశ్వర పాళ్య దేవాలయాన్ని స్వచ్ఛ సైనికులు శుభ్రం చేశారు. స్వచ్ఛ సేవా కార్యక్రమంలో నగర సభ అధ్యక్షుడు శబానా అమానుల్లా, కమిషనర్ శ్రీధర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. భారతీయ వాయుసేన అనుబంధ ఎక్విప్‌మెంట్ డిపో సిబ్బంది, అధికారులు కెంపాపురలో స్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టారు. స్వచ్ఛ సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. కర్ణాటకలో మహాత్ముడు సంచరించిన బెళగావి, మైసూరు, బెంగళూరుల్లోని వివిధ ప్రాంతాల్లో పలువురు నివాళి అర్పించారు. స్వాతంత్ర్య పోరాటానికి ఊపిరిలూదిన శివపుర, విదురాశ్వత్థ తదితర ప్రాంతాల్లో మహాత్మునికి నివాళి అర్పిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.



పారిశుద్ధ్య కార్మికులతో ముచ్చటిస్తున్న కుమారస్వామి



బెంగళూరులో వ్యర్థాలు తొలగిస్తున్న వాయుదళ సిబ్బంది



మహాత్ముని చిత్రపటానికి పూలదండ వేసిన భాజపా నాయకులు విజయేంద్ర, ప్రహ్లాద్‌జోషి తదితరులు

మహాత్ముని స్వచ్ఛ భారత పరికల్పనను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముందుకు తీసుకువెళుతున్నారని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. స్వచ్ఛతను దృష్టిలో ఉంచుకుని దేశంలో ఇప్పటి వరకు తమ ప్రభుత్వం 12 కోట్ల మరుగుదొడ్లను నిర్మించామని తెలిపారు.



స్వచ్ఛ సేవలో పాల్గొన్న వాయుదళ సిబ్బంది, అధికారులు

మైసూరులో రేవ్‌పార్టీ.. పోలీస్ అధికారిపై వేటు

మైసూరు: మైసూరు శివార్లలోని మీనాక్షిపురంలో ఒక వ్యవసాయ క్షేత్రంలో సెప్టెంబరు 28న రాత్రి నిర్వహించిన రేవ్ పార్టీకి సంబంధించి 65 మందిపై కేసులు నమోదు చేశారు. పార్టీ జరుగుతోందని సమాచారం వచ్చినా ఇళవాల ఠాణా ఎస్సై మంజునాథ్ నాయక్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని గుర్తించి, విధుల నుంచి సస్పెండ్ చేశామని ఎస్పీ విష్ణువర్ధన్ వెల్లడించారు. సమాచారం వచ్చిన వెంటనే సిబ్బందితో కలిసి తానే దాడి చేశానని, తనపై అక్కడ ఉన్న యువతీ, యువకులు ప్రతిదాడి చేయడంతో గాయపడి చికిత్స కోసం ఆసుపత్రిలో చేరానని మంజునాథ నాయక్ వివరణ ఇచ్చారు.

చందనవనంలో చలువచూపుల మాత!

ఎందరో అమ్మవారు.. కొలువుదీరిన శక్తి దేవతలు

దసరా పండగ వచ్చిందంటే శక్తిమాతలకు చక్కని సేవలతో భక్తులు పునీతమవుతుంటారు. అమ్మోరి కరుణ, కటాక్షాల కోసం కోవెలల ముంగిట బారులు తీరుతుంటారు. అటు చాముండేశ్వరి ఆలయం మొదలు.. ఇటు మంగళాదేవి దర్శనానికి ఈ నవరాత్రులూ నిత్యం వేనవేల మంది కదలివస్తుంటారు. కన్నడనాట దుర్గమ్మల పూజ పరమపవిత్రంగా భావిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా వెలసిన ఆలయాల్లో గురువారం నుంచే వేడుకల శంఖారావం ప్రతిధ్వనించనుంది.



కటీలు దుర్గాపరమేశ్వరి

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : 'యా దేవీ సర్వభూతేషు చైతన్యరూపేణ సంస్థితః నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః' అంటూ భక్తులు దసరా దుర్గామాతకు స్వాగతం పలుకుతున్నారు. 'సృష్టిలో ఉన్న సర్వజీవరాసుల్లో చైతన్యరూపిణివై వెలసిన ఓ దేవీ నీకు నా అనేక నమస్కారాలు..' అంటూ భక్తులు సదా కొలిచే చైతన్య, జ్ఞాన స్వరూపిణి అయిన దుర్గామాత ఆరాధనోత్సవాలైన నవరాత్రి ఉత్సవాలు గురువారం శుభ దినం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ వేడుకల కోసం మైసూరు, మంగళూరు తదితర నగరాలు సర్వాంగ సుందరంగా రూపుదాల్చాయి. మానవులే కాదు సిద్ధులు, గంధర్వులు, కింపురుషాదులు, దేవతలు అందరూ ఆ శక్తిమాతను వేదమంత్రాలతో స్వాగతించటానికి అన్ని సన్నాహాలు పూర్తిచేశారు. రాష్ట్రంలోని ప్రఖ్యాత మాత దివ్యక్షేత్రాలైన హొరనాడు- అన్నపూర్ణేశ్వరి, మైసూరు- చాముండేశ్వరి, మంగళూరు- మంగళాదేవి, ఇక్కడే వెలసిన కుద్రోళి దుర్గా పరమేశ్వరి, కటీలు దివ్యక్షేత్రంలో దుర్గాపరమేశ్వరి, మంగళూరు కద్రి మంజునాథ దేవస్థానపు పార్వతీ దేవి, కొల్లూరు మూకాంబిక, బళ్లారి కనకదుర్గా మాత, నంజనగూడు పార్వతీ దేవి.. ఇలా అనేక ప్రాంతాలతోపాటు బెంగుళూరు బనశంకరి అమ్మవారు, సనాతన కాడుమల్లేశ్వర దేవస్థానపు గౌరీ మాత.. ఇలా అనేక కోవెలలో శక్తిమాతలు కొలువుదీరి పూజలందుకుంటున్నారు. తొమ్మిది రోజులలూ ప్రధాన అర్చకులు, వేద పండితులు, రుత్వికులు- నవరూపాల్లో అమ్మవార్ని ఆహ్వానించి వైవిధ్యమయ అభిషేకాలు, చండీ హోమాలు, గణపతి పూజలు, నవగ్రహహోమాలు, దుర్గా పారాయణలు, మహిళలచే కుంకుమార్చనలు, విభిన్న అలంకారాల ఆవిష్కరణ తదితరాలు పూర్తి చేయనున్నారు. భక్తి పారవశ్యంతోపాటు నయనానందాన్ని మిగల్చనున్నారు. పుష్పాలంకరణలు, కాయగూరలతో, పట్టుపీతాంబరాలతో పాటు వెండి, బంగారు కవచాలతో అలంకరణలు ప్రత్యేకాంశాలు. ఈ అలంకారాలతోనే అమ్మవార్ల ఊరేగింపులు చేపడతారు. రాష్ట్రమంతా భక్తి వాతావరణం తాండవించనుంది. హరికథలు, సాంస్కృతిక కళా విన్యాసాలు భక్తులకు మనోరంజనాన్ని కలిగిస్తాయి. శైలపుత్రి, బ్రహ్మచారిణి, కూష్మాండ, చంద్రఘంట, స్కంధ మాత, చంద్రహాస, మహాకాళి, గౌరి, సిద్ధధాత్రి.. అనే నవ అవతారాల్లో నిత్య పూజలు.. పచ్చతోరణాల మధ్య అమ్మవారు విరాజిల్లనున్నారు.




హొరనాడు అన్నపూర్ణేశ్వరి



మైసూరు చాముండేశ్వరి



బనశంకరి పరమేశ్వరి



కుద్రోళి దుర్గమ్మ

పవిత్రమైంది వైద్యవృత్తి

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: రోగుల సమస్యలకు వైద్యులు స్పందించి చికిత్స అందించినప్పుడు మాత్రమే వృత్తిలో రాణిస్తారని రాజీవ్ గాంధీ ఆరోగ్య వైద్య విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ ఎం.కె.రమేశ్ పేర్కొన్నారు. మంగళవారం ఎస్‌జేఎం దంతవైద్య కళాశాల 34వ స్నాతకోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. రోగుల బాధలను మానవీయతతో స్పర్శించినప్పుడు మాత్రమే వారికి వైద్యులపై నమ్మకం ఏర్పడుతుందన్నారు. వైద్యవృత్తి ఎంతో పవిత్రమైందని, వైద్యులను దేవునితో సమానంగా పూజించే ప్రజలు ఉన్నారన్నారు. స్నాతకోత్సవంలో 55 మంది బీడీఎస్ పట్టాలు పొందిన దంత వైద్యులకు అందజేసి, వృత్తి ప్రతిజ్ఞను బోధించారు. బెంగళూరు రాజరాజేశ్వరి దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్.సి. గిరీశ్ స్నాతకోత్సవ ఉపన్యాసం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రఘునాథరెడ్డి, కళాశాల పాలకమండలి సభ్యులు బసవకుమారస్వామి, కళాశాల వివిధ విభాగాల హెచ్‌వోడీలు కోదండరామ, హరిణి, దీపా, కేశవరెడ్డి, హరీశ్, జయచంద్ర పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో బీడీఎస్ పదవులను పొందిన వైద్యులతో ప్రముఖుల ఛాయాచిత్రం

సింధనూరు ఆలయాల ముస్తాబు

సింధనూరు, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలకు సింధనూరులోని క్యాంపులు, గ్రామాల్లో దేవస్థానాలు ముస్తాబయ్యాయి. పట్టణంలోని ఆదర్శకాలనీ సాయిబాబా మందిరం, రామకిశోర్ కాలనీ వరసిద్ధి వినాయక ఆలయం, పీఎల్‌డీ బ్యాంకు వద్ద బన్ని మహంకాళమ్మ, ప్రయాణ ప్రాంగణం వద్ద అంబామాత దేవాలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ఈజే.హొసళ్లిక్యాంపు దుర్గమ్మగుడిలో బుధవారం నుంచే వేడుక ఆరంభమైంది. మొత్తం 11 రోజులు ఇక్కడ భక్తులకు అన్నసంతర్పణ చేస్తున్నారు. అంబామఠంలోని బగళాముఖి అంబాదేవి దేవస్థానంలో కూడా దేవదాయ శాఖ ఉత్సవ ఏర్పాట్లు చేసింది. గాంధీనగర్ శివ పంచాయతన క్షేత్రంలో ఆలయ సమితి ఘనంగా ఏర్పాట్లు చేశారు. సింధనూరు దసరా-2024 వేడుకకు కూడా ఇక్కడే అంకురార్పణ జరుగుతోంది. గాంధనగర్‌లోని 36వ కాలువ వద్ద గురువారం సాయంత్రం అయిదు గంటలకు ఎమ్మెల్యే బాదర్లి సారధ్యంలోని పెద్దలంతా 'తుంగా హారతి' పట్టి ఉత్సవాలకు తెర లేపనున్నారు.



గాంధీనగర్ శివ పంచాయతన క్షేత్రంలో ఉత్సవాల కోసం చలువ పందిర్లు

ఈతకెళ్లి బాలుడి మృతి


చెళ్లకెర(చిత్రదుర్గం): హొసదుర్గం తాలూకా శనిదేవరహట్టి గ్రామం వద్ద నీటి కొలనులో ఈతకెళ్లిన హొన్నకెరె గొల్లరహట్టికి చెందిన సదాశివ కుమారుడు ఆకాశ్ (9) అనే బాలుడు నీట మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం జరిగిందని పోలీసులు తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా పాఠశాలకు సెలవు ప్రకటించడంతో స్నేహితులతో కలిసి ఆకాశ్ ఈతకు వెళ్లాడు. ఇటీవల ఈ నీటిగుంటలో గ్రామానికి చెందిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయగా, అవి కరిగిన ఒండ్రుమట్టిలో కూరుకుపోయిన బాలుడు మృత్యువాత పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. హొసదుర్గం గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

వేధించడంతోనే దాడి

హుబ్బళ్లి: వడ్డీ సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ గణేశ్ సిద్ధాపుర అనే వ్యక్తి తన అనుచరులతో కలిసి దాడి చేశాడని ఆరోపించిన వినాయక్ రోణ కేసు కొత్త మలుపు తిరిగింది. గణేశ్ భార్యకు ఫోన్ చేసి అశ్లీలంగా మాట్లాడడం, అశ్లీల చిత్రాలు, వీడియోలు పంపిస్తూ ఉండడంతోనే అతనిపై దాడి జరిగిందని డీసీపీ మహానింగ నందగావి స్పష్టం చేశారు.

'సిద్ధరామయ్య రాజీనామా చేయాలి'

బళ్లారి, న్యూస్‌టుడే: ముడా స్థలాల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేసి విచారణ ఎదుర్కోవాలని లోక్‌సభ మాజీ సభ్యుడు మునిస్వామి డిమాండ్ చేశారు. బుధవారం భాజపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముడా ఆరోపణలు ఎదుర్కొంటున్న సిద్ధరామయ్య రాజీనామా చేయాలని బెంగళూరు నుంచి మైసూరుకు పాదయాత్ర చేసిన సందర్భంలో తమనెన్నా ముందే పాదయాత్ర చేస్తున్న ప్రాంతాల్లో అవినీతి కప్పిపుచ్చుకోవడానికి సమావేశాలు నిర్వహించారని ప్రజలు నమ్మలేదన్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్న గవర్నర్‌ను చులకనగా మాట్లాడారని ఆరోపించారు. గతంలో యడియూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆరోపణలు రాగానే తన పదవికి రాజీనామా చేసి విచారణకు సహకరించారు. ప్రస్తుతం సిద్ధరామయ్య మొండిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డీనోటిఫికేషన్‌లో అక్రమాలకు పాల్పడిన వారందురూ విచారణ ఎదుర్కోవాల్సిందేనన్నారు. ముడాలో రూ. ఐదువేల కోట్ల అక్రమాలు జరిగాయి. దళిత, అహింద పేరు చెప్పుకుంటూ అధికారంలోకి వచ్చిన సిద్ధరామయ్య తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి ఎస్.టి.నాగరాజు, బసవరాజగౌడ యత్నాల్‌పై తీవ్రంగా విమర్శించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీశ్, రామాచంద్రప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మునిస్వామి, చిత్రంలో భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీశ్ తదితరులు

సణ్ణ దుర్గమ్మ దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర ప్రజలు ఆరాధ్య దైవంగా కొలిచే సణ్ణ దుర్గమ్మ దేవస్థానంలో ఈ నెల 3 నుంచి 12 వరకు తొమ్మిదో వార్షిక దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ట్రస్ట్ అధ్యక్షుడు మీనాళ్లి తాయణ్ణ, గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. బుధవారం దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సణ్ణ దుర్గమ్మ వేర్వేరు రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 3న బాలత్రిపుర సుందరి, 4న గాయత్రీదేవి, 5న శ్రీలలితా దేవి, 6న అన్నపూర్ణేశ్వరి దేవి, 7న ఆదిశక్తి దేవి, 8న మహాలక్ష్మి దేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్దిని, 12న నిజరూపదేవి అలంకరణ చేస్తున్నట్లు వివరించారు. దేవస్థానం ఆధ్వర్యంలో 1,008 మంది మహిళలకు ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దాతలు సత్యనారాయణ, మౌలాలి చీరలు అందజేసినట్లు తెలిపారు. 7న సాయంత్రం 4 గంటలకు శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 10న ఉదయం 6.30గంటలకు గంగా పూజ, 8 గంటలకు మహా చండీయాగం, పూర్ణాహుతి హోమం ఉంటుంది. దేవస్థాన ట్రస్ట్ సభ్యులు హనుమంతప్ప, రాధమ్మ ప్రకాష్, పంతోష్ స్వామి, తిప్పణ్ణ, రమేష్, కృష్ణ, రాము, ఎర్రిస్వామి, బాబు పాల్గొన్నారు.



సణ్ణ దుర్గమ్మకు విశేష అలంకరణ

నగర పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

బళ్లారి, న్యూస్‌టుడే: పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. నగర పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర మేయర్ ముల్లంగి నందీష్ కోరారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ, నగర పాలికె సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హెచ్.ఆర్.గవియప్ప కూడలి సమీపంలోని బుడా కార్యాలయంలో శ్రమదాన కార్యక్రమాన్ని మేయర్ ప్రారంభించారు. గాంధీజయంతి రోజు మాత్రమే స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తే సరిపోదు.... 365 రోజులు మనం నివసించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా పంచాయతీ సీఈవో రాహుల్ శరణప్ప సంకనూర మాట్లాడుతూ పరిశుభ్రత ఓ సేవా కార్యక్రమం. ప్రతి ఒక్కరూ హృదయం నుంచి రావాలన్నారు.



స్వచ్ఛభారత్ కింద చేస్తున్న శ్రమదానంలో మేయర్ తదితరులు

ఆడపిల్ల పుట్టిందని..

మగబిడ్డ మృతదేహం అప్పగించారు

గంగావతి,న్యూస్‌టుడే: కొప్పళ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్వాకం తల్లిదండ్రులకు శోకాన్ని మిగిల్చింది. ఆడపిల్ల పుట్టిందంటూ చెప్పి ధ్రువీకరణ పత్రం ఇచ్చి వారం రోజుల తరువాత మగపిల్లవాడి మృతదేహాన్ని అప్పగించడాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. కొప్పళ తల్లీబిడ్డల ఆసుపత్రిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లికి చెందిన గౌరి అనే ఏడు నెలల గర్భిణికి లోపల నీరు చేరినందున కొప్పళ తల్లీబిడ్డ ఆసుపత్రిలో చేరాలని అక్కడి వైద్యులు సిఫార్సు చేశారు. సెప్టెంబరు 23న ఆమె ప్రసవం కోసం కొప్పళ ఆసుపత్రిలో చేరారు. 25న ఆమె ప్రసవం జరిగింది. ఆడపిల్ల పుట్టింది, బరువు కిలో మాత్రమే ఉంది, కామెర్లు కనిపించడంతో అత్యవసర చికిత్సా విభాగంలో ఉంచాలని వైద్యులు తెలిపినట్లు దంపతులు చెప్పారు. ఏడు రోజుల తరువాత ఫోను చేసి బిడ్డ మృతి చెందింది, మృతదేహం తీసుకెళ్లాలని సమాచారం ఇచ్చారన్నారు. మృతదేహాన్ని మంగళవారం ఇంటికి తెచ్చి చూడగా మగపిల్లవాడు అని గుర్తించినట్లు చెప్పారన్నారు. వారు మృతదేహంతోపాటు ఆసుపత్రికి తిరిగొచ్చి ఆడపిల్ల పుట్టిందంటూ ధ్రువీకరణ పత్రం ఇచ్చి, మగపిల్లవాడి మృతదేహం ఇచ్చారెందుకని? సిబ్బందిని నిలదీశారు. దాఖలాలు పరిశీలించిన సిబ్బంది జరిగిన పొరపాటును గుర్తించారు. పుట్టింది మగపిల్లవాడే ప్రసవం కాగానే మగపిల్లవాడు అని నమోదు చేశామన్నారు. అత్యవసర చికిత్సా విభాగంలో చేర్చే ముందు ఆడపిల్లగా నమోదు చేసి పొరపాటు చేసినట్లు వివరణ ఇచ్చారు. దీనిపై దర్యాప్తునకు ఆదేశించినట్లు వైద్యాధికారులు తెలిపారు. తల్లిదండ్రులు దీన్ని అంగీకరించకపోవడంతో నవజాత శిశువు మృతదేహాన్ని శవాగారంలో ఉంచారు. త్వరగా దర్యాప్తు చేసి నిజం ఏమిటో వివరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



కొప్పళ తల్లీబిడ్డల ఆసుపత్రిలో ధ్రువీకరణ పత్రం ప్రదర్శిస్తున్న తల్లిదండ్రులు

ఆనెగుందిలో ఏడాదిపాటు స్వచ్ఛతా చైతన్యం

గంగావతి,న్యూస్‌టుడే: పౌరాణిక, చరిత్ర ప్రసిద్ధ ఆనెగుందిని దత్తత తీసుకుని ఏడాదిపాటు స్వచ్ఛతా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని గంగావతి అదనపు జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి సదానంద నాయ్క పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆనెగుందిలో శ్రమదానం, దత్తత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచ ప్రసిద్ధ ఆనెగుందిని పర్యావరణ స్నేహ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలన్నారు. ఇక్కడ మౌలిక వసతులు కల్పించడం, స్మారకాల రక్షణ విషయంలో నిర్లక్ష్యంపై విచారం వ్యక్తం చేశారు. న్యాయసేవా సమితి అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని స్మారకాల వద్ద శ్రమదానం చేశారు. హాస్య సంభాషణాకారులు బి.ప్రాణేశ్, న్యాయమూర్తులు రమేశ్‌గాణగేర్, నాగేశ్‌పాటిల్, రాజవంశీకులు లలితారాణి శ్రీరంగదేవరాయలు, అల్లూరి సోమరాజు, రత్నశ్రీ శ్రీకృష్ణదేవరాయ, పంచాయితీ అధ్యక్షురాలు మహాదేవి బాళెకాయి, డీవైఎస్‌పి సిద్ధనగౌడ, ఈఓ లక్ష్మీదేవి, అటవీశాఖ రేంజర్ సుభాష్‌చంద్రనాయక్, సీడీపీవో జయశ్రీ పాల్గొన్నారు.



ఆనెగుంది దత్తత కార్యాక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి సదానందనాయ్క



ఆనెగుందిలో గాంధీ జయంతి పురస్కరించుకుని న్యాయమూర్తుల శ్రమదానం

భక్తిశ్రద్ధలతో కరియమ్మ దేవి ఉత్సవాలు

చెళ్లకెర(చిత్రదుర్గం): చెళ్లకెర తాలూకా జాజూరులో బుధవారం భక్తిశ్రద్ధలతో కరియమ్మ దేవి అమ్మవారిని ఊరేగించారు. వార్షిక తిరునాళ్లలో భాగంగా అమ్మవారిని సమీపంలోని వేదవతి నది వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి గంగ పూజలను నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులను సమర్పించుకొన్నారు.



చెళ్లకెర తాలూకా జాజూరులో కరియమ్మ దేవి అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

గంజాయి స్వాధీనం

హొసపేటె, న్యూస్‌టుడే: హొసపేటె తాలూకాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో దాడులు చేసిన పోలీసులు రూ.49,150 విలువచేసే గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని ముగ్గురు విక్రేతలను అరెస్టు చేశారు. కమలాపుర పోలీసులు వర్సిటీ మార్గంలో గంజాయి విక్రయిస్తున్న నాగరాజ్‌ను అదుపులో తీసుకున్నారు. హంపీ పోలీసులు గాళెమ్మనగుడి, కడ్డిరాంపుర ప్రాంతాల్లో దాడులు చేసి విష్ణు, విరుపాక్షి అనే విక్రేతలను అరెస్టు చేశారు. గ్రామీణ పోలీసులు జంబునాథ మార్గంలోని ఓ ప్రాంతంలో దాడులు చేశారు. సంబంధిత పోలీస్ ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి.

సమస్యల పరిష్కారానికి చర్యలు : మంత్రి

మాన్వి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ప్రైవేట్ విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి ఎన్.ఎస్.బోసురాజు హామీ ఇచ్చారు. బుధవారం తాలూకా ప్రైవేట్ శిక్షణ సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం, ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రప్రథమంగా రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా అరకెరాలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, సీఎంతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్ మాట్లాడుతూ శిక్షణ విషయంలో ప్రైవేట్, ప్రభుత్వ అనే తేడాలేదన్నారు. ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయులకు అందిస్తున్నట్లే ప్రైవేట్ ఉపాధ్యాయులకు బంగారు పతకాలు అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యేలు బసనగౌడ బ్యాగవాట్, గంగాధర్‌నాయక్, రాజా వెంకటప్పనాయక్, ఒక్కూట అధ్యక్షుడు హెచ్.శర్ఫుద్దీన్ మాట్లాడారు. కార్యక్రమంలో కల్మఠ విరూపాక్ష పండితారాధ్య స్వామీజీ, క్షేత్ర శిక్షణాధికారి చంద్రశేఖర్, కురుబ సంఘం అధ్యక్షుడు ఎం.ఈరణ్ణ, సయ్యద్ అక్బర్ పాషా, వీరేశ్, కేశవరెడ్డి, ఈరణ్ణ మర్లట్టి, రాజు తాళికోటె, సణ్ణబసనగౌడ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్, తదితరులు

పుస్తక పఠనంతో మానసిక వికాసం

బళ్లారి, న్యూస్‌టుడే: విద్యార్థులు పుస్తక పఠనం చేస్తుంటే ఉత్తమ భవిష్యత్తు ఉంటుంది. సమాజంలో తల ఎత్తుకుని గౌరవంగా జీవనం సాగిస్తారని జిల్లా పోలీస్ అధికారి శోభారాణి విద్యార్థులకు సూచించారు. బళ్లారి శ్రీచైతన్య పదవీ పూర్వ సామూహిక విద్యా సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక తాళూరు రహదారిలోని కళాశాల క్యాంపస్ ఆవరణలో నూతన విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. తలదించుకునే జీవించే మిమ్మల్ని పుస్తక పఠనం చేస్తే తల ఎత్తుకుని జీవించే శక్తి వస్తుంది. ప్రస్తుతం విద్యార్థులు చరవాణికి బానిస అయ్యారు. విద్యార్థులు మానసికంగా బాధపడే పరిస్థితి తీసుకుని వచ్చారు. చరవాణిని తగ్గించుకుని పుస్తక పఠనం చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. శ్రీ చైతన్య పదవీ పూర్వ సామూహిక కళాశాల నిర్దేశకుడు డా.పి.రాధాకృష్ణ మాట్లాడుతూ సమాజంలో విశేష సాధన చేసిన విద్యార్థులను ఇలాంటి కార్యక్రమాలకు ఆహ్వానించి స్ఫూర్తి నింపే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సీఈవో ప్రసన్న ఆంజనేయ, ప్రధాన ఆచార్యుడు రాఘవేంద్ర సింధిల్, గయాజ్, గిరికుమార్, సందీప్ పాల్గొన్నారు.



ఎస్పీ శోభారాణిని సన్మానిస్తున్న డా.రాధాకృష్ణ, ప్రసన్న ఆంజనేయ తదితరులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

నేటి నుంచి కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు



దసరా ఉత్సవాలకు సిద్ధమైన కనకదుర్గమ్మ ఆలయం

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని నగర ఆరాధ్య దేవత కనకదుర్గమ్మ ఆలయంలో గురువారం నుంచి ఉత్సవాలు జరుపుతున్నట్లు ఆలయ ఈవో హనుమంతప్ప తెలిపారు. రోజూ విశేష అభిషేకాలు పూజలు జరుపుతామన్నారు. సాయంత్రం పురాణ ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 10 నుంచి 13 వరకు అమ్మవారికి సువర్ణ కవచ అలంకరణ చేస్తామన్నారు. 12న సాయంత్రం పల్లకీ ఉత్సవం ఉంటుంది. 7 గంటలకు లంకదహనం చేస్తామన్నారు.

ఉరుకుంది ఈరణ్ణ ఆలయంలో పూజలు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: పట్టణంలోని ఉరుకుంది ఈరణ్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలయ అమావాస్య పురస్కరించుకుని ఉరుకుంది ఈరణ్ణను ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాలనీ వాసులతో పాటు పట్టణంలోని, గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు, ప్రజలు పూజల్లో పాల్గొన్నారు.



సిరుగుప్ప ఉరుకుంది ఈరణ్ణ ఆలయంలో పూజలు

బళ్ళారి
•బళ్ళారి •రాయచూరు

ముష్టూరు క్యాంపులో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు

ముష్టూరుక్యాంప్ (శ్రీరామనగర్), న్యూస్‌టుడే: కారటగి తాలూకా ముష్టూరు క్యాంపులో మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఏడో సంవత్సర స్వచ్ఛంద రక్తదాన శిబిరం బుధవారం జరిగింది. రామాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 45 మంది రక్తదానం చేశారు. గంగావతి అంజనాద్రి రక్త భండార సహకారంతో క్యాంపు వాసులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ శిబిరం నిర్వహించారు.

వాల్మీకి పురస్కార ఎంపిక సమితిలో చోటు

హొసపేటె, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఇవ్వనున్న రాష్ట్రస్థాయి మహర్షి వాల్మీకి పురస్కార ఎంపిక సమితిలో విజయనగర జిల్లాకి చెందిన ఇద్దరికి చోటు దక్కింది. ఒకరు అధ్యక్షుడు, 10 మంది సభ్యులు గల ఈ ఎంపిక సమితిలో హంపీ కన్నడ వర్సిటీకి చెందిన సీనియర్ ప్రాధ్యాపకుడు డాక్టర్ విరుపాక్షప్ప పూజారహళ్లి, ప్రస్తుతం హావేరి జిల్లా గొటగోడిలో ఉన్న జానపద విశ్వవిద్యాలయం ప్రాధ్యాపకుడు, కూడ్లిగి తాలూకా నివాసి డాక్టర్ అరుణ్‌జోళద కూడ్లిగికి అవకాశం దక్కింది. ఈ నెల 17న రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకి జయంతి ఆచరిస్తున్నారు. ఆలోపు ఈ సమితి సభ్యులు దరఖాస్తులు వేసినవారిలో వాల్మీకి పురస్కారానికి ఎంపిక చేయాల్సి ఉంది.


బళ్లారి : గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ తుకారామ్, ముండరగి నాగరాజ, ఆంజనేయులు


ప్రతిజ్ఞ చేయిస్తున్న జడ్పీ సీఈవో రాహుల్ శరణప్ప సంకనూర


బళ్లారి : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది, విద్యార్థులు


బళ్లారి గ్రామీణ : సంజీవరాయన కొటె ప్రభుత్వ పాఠశాలలో గాంధీజయంతిని ఆచరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

శాంతిదూత.. గాంధీతాత


కంప్లి: గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో శుభ్రం చేస్తున్న తహసీల్దార్ తదితరులు


కారటగి: జాతాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు


సింధనూరులో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


గంగావతిలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శాసనసభ్యుడు జనార్దన్‌రెడ్డి


సిరుగుప్ప: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా జాతా

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రపంచంలోనే శాంతిదూత, అహింసావాది మహాత్మాగాంధీ జీవిత తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పార్లమెంట్ సభ్యులు ఇ.తుకారామ్ కోరారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ, వార్తశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పాలనాధికారి కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన మహాత్మా గాంధీ జయంతిని ఎంపీ ప్రారంభించి మాట్లాడారు. మహాత్మాగాంధీ విశ్వ శాంతిదూత, తన జీవితాన్ని ఇతరులకు ధారపోశారన్నారు. ఆయన జీవితం కొత్త తరం యువతకు ఆదర్శమన్నారు. జాతిపిత ఆదర్శాలను నేటి యువతకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధి చేస్తాం


హగరి కృషి విశ్వవిద్యాలయంలో గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతిని ఆచరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

బళ్లారి, విజయనగరం జిల్లాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. దశల వారీగా అభివృద్ధి చేస్తామన్నారు. బళ్లారి నగరంలో పలు రైల్వే అభివృద్ధి పనులకు సంబంధించి కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లడంతో సుధా క్రాస్ ఫైవంతెన, హెచ్.ఆర్.గవియప్ప కూడలి అభివృద్ధి, వంతెన విస్తరణ, రేడియో పార్క్ వద్ద ఫైవంతెన పనులకు త్వరలో భూమిపూజ చేస్తామని ఎంపీ పేర్కొన్నారు. మండలి రాష్ట్ర అధ్యక్షుడు ముండరగి నాగరాజ, మేయర్ ముల్లంగి నందీష్, బుడా అధ్యక్షుడు జె.ఎస్.ఆంజనేయులు, చిదానందప్ప, జడ్పీ సీఈవో రాహుల్ శరణప్ప సంకనూర, ఏడీసీ మహమ్మద్ ఝుబేర, ఏసీ ప్రమోద్, తహసీల్దార్ గురురాజ, కన్నడ సంస్కృతిక అధికారి నాగరాజ, వార్తశాఖ కార్యాలయం అధికారి గురురాజ, సిబ్బంది విజయకుమార్, హనుమంతప్ప, వై.మల్లేశప్ప, హనుమేశ్, అభిషేక్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

విజేతలు వీరే..

గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులు అందజేశారు. ఉన్నత పాఠశాల విభాగంలో సూర్పి గౌడ (ప్రథమ), ఎస్.ఎస్.సాయిచేతన్ (ద్వితీయ), నయన (తృతీయ) స్థానాల్లో నిలిచారు. పదవీ పూర్వ విభాగంలో బాలాజీ (ప్రథమ), ఎం.దేవిరమ్మ (ద్వితీయ), ప్రియదర్శిని (తృతీయ), డిగ్రీ, పీజీ విభాగంలో నాగరాజ (ప్రథమ), ఆర్.రమేష్ (ద్వితీయ), వివేకానంద (తృతీయ) ఆయా స్థానాల్లో నిలిచారు.

కంప్లి: కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మహాత్మా గాంధీ. లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వైభవంగా జరిగింది. వారి చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. తహసీల్దార్ శివరాజ్ తదితరులు స్వచ్ఛత గురించి ప్రతిజ్ఞ చేశారు.

● **కాంగ్రెస్ ఆధ్వర్యంలో...** కంప్లి సాంగత్రయ సంస్కృత పాఠశాల ఆవరణలో కంప్లి, కురుగోడు బ్లాక్ కాంగ్రెస్ సమితులు గాంధీ జయంతిని నిర్వహించాయి. ఎమ్మెల్యే గణేశ్, కంప్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.శ్రీనివాస రావు, కురుగోడు పార్టీ అధ్యక్షుడు చెన్న బసవ, పురసభ సభ్యులు పాల్గొన్నారు.

హొసపేటె: బాపూజీ కలలు కన్న గ్రామస్వరాజ్ కలలను సాకారం చేయటానికి అందరూ కృషి చేయాలని జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్ పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లా పాలనాధికారి కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎస్పీ శ్రీహరిబాబు, జడ్పీ సీఈవో ఎన్.మొహ్మద్ అలి అక్రంషా తదితరులు పాల్గొన్నారు.

సింధనూరు: మహాత్ముని సారథ్యంలో అఖిల భారత కాంగ్రెస్ సమితి సమావేశానికి వంద ఏళ్లు అయిన సందర్భంగా ఏడాది పొడవునా ఆయన్ను గౌరవంగా స్మరించుకుంటూ..కార్యక్రమాలు చేపడదామని తాలూకా కాంగ్రెస్ అధ్యక్షుడు శివకుమార్ జవళి కార్యకర్తలను కోరారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు వంద అడుగుల జాతీయ పతాకాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. శివకుమార్ జవళి, సోమనగౌడ బాదర్లి, వెంకటేశ్ రాగలపర్వి పాల్గొన్నారు. ఎమ్మెల్యే బాదర్లి, మాజీ మంత్రి నాడగౌడ, మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప తహసీల్దారు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

చెళ్లకెర: సత్యం, అహింసలకు గాంధీజీ ప్రతి రూపమని స్థానిక ఎమ్మెల్యే రఘుమూర్తి పేర్కొన్నారు. బుధవారం తాలూకా పంచాయతీ కార్యాలయంలో గాంధీ, శాస్త్రిల జయంతుల సందర్భంగా వారి చిత్రపటాలకు పుష్పార్చన చేసి నివాళులు అర్పించారు. తహసీల్దార్ రెహాన్ పాషా, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామనగర్: గంగావతి తాలూకా చిక్క జంతకల్ గ్రామ పంచాయతీ పరిధి హళె అయోధ్యలో మహాత్మాగాంధీ జయంతి జరిగింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో గాంధీజీ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. గ్యారంటీ పథకాల అనుష్టాన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.ఆర్.మెహరోజ్ ఖాన్, సమితి జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు నేత్రావతి, ఉపాధ్యక్షుడు నాగప్ప, పీడీఓ మల్లికార్జున, ప్రముఖులు ఉండవల్లి శ్రీనివాస్, నాగరాజ్ అరళి, రేణుక గౌడ పాల్గొన్నారు.


హొసపేటె: పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ వర్గాలు


హొసపేటె: గాంధీ వేషధారణతో హగరిబొమ్మనహళ్లి తాలూకా తంబ్రహళ్లి ఉర్దూ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

గంగావతి: పట్టణంలో గాంధీ జయంతిని ఘనంగా ఆచరించారు. శాసనసభ్యుడు గాలి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతిని ఘనంగా ఆచరించారు. గాంధీ కూడలిలో ఆయన విగ్రహానికి పుష్పార్చన చేసి నివాళులర్పించారు. శాసనసభ మాజీ సభ్యుడు పరణ్ణ మునవళ్లి, నగరసభ అధ్యక్షుడు మౌలా సాబ్, సింగనాళ విరూపాక్షప్ప పాల్గొన్నారు.

సిరుగుప్ప: గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి ఉత్సవాన్ని వైభవంగా ఆచరించారు. ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని గాంధీ కూడలిలో నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ, తహసీల్దార్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విశ్వనాథ్ పరిసరాల పరిశుభ్రతపై ప్రమాణం చేయించారు. నగరసభ ఉపాధ్యక్షురాలు యశోధమూర్తి, గ్రేడ్-2 తహసీల్దారు సత్యమ్మ, నగరసభ కమిషనర్ గురుప్రసాద్ పాల్గొన్నారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ కూడలిలో మాజీ శాసనసభ్యుడు టి.ఎ.చంద్రశేఖరయ్య స్వామి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు.

బళ్లారి గ్రామీణ: శాంతి, అహింసతో దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించింది. శాంతిదూత గాంధీజీ అని కర్ణాటక క్రియాశీల ఉపాధ్యాయ వేదిక అధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు. సంజీవరాయన కొటె ప్రభుత్వ పాఠశాలలో గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. సత్యనారాయణ పేట శారదా విద్యాపీఠంలో గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా ఆచరించారు. హగరి వ్యవసాయ కేంద్రం, జేడీఎస్ పార్టీ కార్యాలయంలోనూ ఘనంగా ఆచరించారు. కార్యక్రమంలో ముఖ్యోపాధ్యాయిని కవిత, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


బళ్లారి గ్రామీణ: శారదావిద్యాపీఠంలో గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న ముఖ్యోపాధ్యాయిని కవిత తదితరులు


శ్రీరామనగర్: హళె అయోధ్య జయంతిలో మాట్లాడుతున్న మెహరోజ్ ఖాన్


చెళ్లకెర తాలూకా పంచాయతీ కార్యాలయంలో గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రిల చిత్రపటాలకు పుష్పార్చన చేస్తున్న ఎమ్మెల్యే రఘుమూర్తి


కంప్లి: తహసీల్దార్ కార్యాలయంలో స్వచ్ఛ జాగృతిపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

తుంగభద్ర కాలువకు శాశ్వత పరిష్కారం చూపాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు బసనగౌడ, గంగాధర్‌నాయక్

మాన్వి, న్యూస్‌టుడే : తుంగభద్ర ఎడమ కాలువ సమస్యకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శాశ్వత పరిష్కారం చూపాలని మాజీ ఎమ్మెల్యేలు బసనగౌడ బ్యాగవాట్, గంగాధర్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పత్రికా భవనంలో పార్టీ తాలూకా అధ్యక్షుడు జాలాది సుధాకర్‌తో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 5న మాన్వికి వస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించనున్నట్లు చెప్పారు. సీఎం నుంచి సరైన సమాధానం రాకుంటే అక్కడే ధర్నా చేస్తామని తెలిపారు. గంగాధర్‌నాయక్ మాట్లాడుతూ ఈ సమస్యను అన్ని ప్రభుత్వాలూ విస్మరించాయన్నారు. జిల్లాలకు ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ నీటి సమస్య పరిష్కారం కాలేదన్నారు. నీటిపారుదల శాఖపై అనుభవమున్న బోసురాజు తాలూకాలో ఒక్క పథకాన్ని కూడా చేపట్టలేదన్నారు. సమావేశంలో జగదీశ్ ఓతూరు, వీరభద్రగౌడ, గురుసిద్ధప్ప, అయ్యప్పనాయక్ మేకల్, రామనగౌడ, కుమారస్వామి, విరూపాక్షగౌడ తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళులు


పంపా పార్కులో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

మాన్వి, న్యూస్‌టుడే : జాతిపిత మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంత్యుత్సవాలను మాన్వి, సిరివార, లింగసుగూరు తాలూకాల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో పంపా పార్కులో సర్వధర్మ సమ్మేళనం ఆచరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌తో పాటు పలువురు వక్తలు గాంధీ, శాస్త్రిల త్యాగాలు, దేశం కోసం వారు పడిన కృషిని ప్రస్తుతించారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు లక్ష్మీ వీరేశ్, కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఈరణ్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గఫూర్‌సాబ్, పురపాలక సంఘం ప్రతిపక్ష నాయకుడు మహేంద్రనాయక్, తహసీల్దార్ రాజు ఫిరంగి, ముఖ్యాధికారి గంగాధర్, పురపాలక సంఘం సభ్యులు, మత పెద్దలు, అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

పట్టణంలోని వాల్మీకి క్రాస్ నుంచి కాంగ్రెస్ కార్యాలయం వరకు పార్టీ ఆధ్వర్యంలో జయంత్యుత్సవ ఊరేగింపు నిర్వహించారు. కూడలి నుంచి ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పాదయాత్ర చేశారు. కార్యాలయంలో గాంధీ, శాస్త్రి చిత్ర పటాలకు నివాళులర్పించారు. పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

మాన్వి: తాలూకాలోని జీనూరుక్యాంపులో యమునప్ప (35) అనే రైతు అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకొన్నట్లు పోలీసులు తెలిపారు. పోత్నాళలోని ప్రగతి గ్రామీణ బ్యాంకులో రూ.3 లక్షల మేరకు పంట రుణాలు తీసుకున్నాడు. పంటలు పండకపోవటంతో అప్పులు తీర్చలేకపోయాడు. చేసిన అప్పు తీర్చలేనన్న భయంతో మంగళవారం రాత్రి ఇంటి బయట ఇనుప గ్రిల్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. యమునప్ప భార్య గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రితాతకు అమావాస్య పూజలు


చెళ్లగుర్కి ఎర్రితాతకు పుష్పాలంకరణ

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: మహాలయ అమావాస్యను పురస్కరించుకుని చెళ్లగుర్కి ఎర్రితాత మఠంలో మంగళవారం విశేష పూజలు జరిపారు. తాతకు అభిషేకాలు చేశారు. పుష్పాలతో అలంకరించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. కౌల్‌బజార్ పెద్దమ్మ తల్లికి అమావాస్య పూజలు వైభవంగా నిర్వహించారు. సంతోషిమాత, మల్నాడు దుర్గమ్మ, కనకదుర్గమ్మ, ఏళుమక్కళతాయి, నగరేశ్వరీ, రాజరాజేశ్వరీ ఆలయాల్లో పూజలు ఘనంగా జరిపారు.


పెద్దమ్మతల్లికి విశేష అలంకరణ

తెరపై ఈనాడు

ఉమ- సంజు (కన్నడ), **గంగా-** భీమ (కన్నడ), **శివ-** సత్యం సుందరం (తెలుగు)
నటరాజ్: జోకర్ (ఆంగ్లం), **రాధిక-** దేవర (తెలుగు), **రాఘవేంద్ర-** దేవర(తెలుగు)
మూవీటైమ్ మాల్ స్క్రీన్1- దేవర (కన్నడ)
స్క్రీన్2- దేవర (హిందీ),
స్క్రీన్3- దేవర (తెలుగు)

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

02-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.91	1617.64
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	8,726	1,077
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,175	9,715
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.421	54.964

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

యువకుడి ఆత్మహత్య


శరణబసవ (పాతచిత్రం)

కారటగి, న్యూస్‌టుడే: కారటగి తాలూకా బేవినాళ గ్రామానికి చెందిన బళగనూరు శరణబసవ (31) అనే యువకుడు అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యవసాయం కోసం రూ.20 లక్షల అప్పు చేసిన ఆయన పంట సరిగా పండకపోవడంతో అప్పు తీర్చేమార్గం కనిపించక ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. సెప్టెంబరు 30న మధ్యాహ్నం పొలానికి వెళ్తానంటూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఆయన కారటగిలోని ఓ లాడ్జిలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శరణబసవ బంధువు అయ్యన గౌడ ఫిర్యాదు మేరకు కారటగి ఠాణాలో బుధవారం కేసు నమోదయింది.

ధర్మస్థల యోజన ట్రస్ట్ సేవలు అభినందనీయం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాదర్లి

సింధనూరు, న్యూస్‌టుడే: వైద్య రంగంలో వెలకట్టలేని సేవలందిస్తున్న డా.వీరేంద్ర హెగ్గడే శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన ట్రస్ట్ నెలకొల్పి అనేక జనపర కార్యక్రమాలు జరుపుతూ మన్ననలు అందుకోవడం గొప్ప విషయమని సింధనూరు శాసనసభ్యుడు బాదర్లి కొనియాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఆరోగ్యవంతమైన సింధనూరు కోసం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనేక గ్రామాల నుంచి వందల సంఖ్యలో మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని తలపై కలశాలు పెట్టుకుని జనజాగృతి జరిపారు. కనకదాస కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో మహిళలు తమ అనుభవాలు పంచుకున్నారు. మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప, జేడీఎస్ నాయకుడు బసవరాజ్ నాడగౌడ, యోగా గురువు ఎం.భాస్కర్, ట్రస్ట్ ప్రతినిధులు ఎల్.విరుపాక్షప్ప, రోహితాక్ష, శేఖర్ శెట్టి పాల్గొన్నారు.

చందనవనంలో చలువచూపుల మాత!

ఎందరో అమ్మవారు.. కొలువుదీరిన శక్తిదేవతలు

దసరా పండగ వచ్చిందంటే శక్తిమాతలకు చక్కని సేవలతో భక్తులు పునీతమవుతుంటారు. అమ్మోరి కరుణ, కటాక్షాల కోసం కోవెలల ముంగిట బారులు తీరుతుంటారు. అటు చాముండేశ్వరి ఆలయం మొదలు.. ఇటు మంగళాదేవి దర్శనానికి ఈ నవరాత్రులూ నిత్యం వేనవేల మంది కదలివస్తుంటారు. కన్నడ నాట దుర్గమ్మల పూజ పరమపవిత్రంగా భావిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా వెలసిన ఆలయాల్లో గురువారం నుంచే వేడుకల శంఖారావం ప్రతిధ్వనించనుంది.


బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : 'యా దేవి సర్వభూతేషు చైతన్యరూపేణ సంస్తితః నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః' అంటూ భక్తులు దసరా దుర్గామాతకు స్వాగతం పలుకుతున్నారు. 'సృష్టిలో ఉన్న సర్వ జీవరాసుల్లో చైతన్యరూపిణివై వెలసిన ఓ దేవీ నీకు నా అనేక నమస్కారాలు..' అంటూభక్తులు సదా కొలిచే చైతన్య, జ్ఞాన స్వరూపిణి అయిన దుర్గామాత ఆరాధనోత్సవాలైన నవరాత్రి ఉత్సవాలు గురువారం శుభ దినం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ వేడుకల కోసం మైసూరు, మంగళూరు తదితర నగరాలు సర్వాంగ సుందరంగా రూపుదాల్చాయి. మానవులేకాదు సిద్ధులు, గంధర్వులు, కింపురుషాదులు, దేవతలు అందరూ ఆ శక్తిమాతను వేదమంత్రాలతో స్వాగతించటానికి అన్ని సన్నాహాలు పూర్తిచేశారు. రాష్ట్రంలోని ప్రఖ్యాత మాత దివ్యక్షేత్రాలైన హొరనాడు- అన్నపూర్ణేశ్వరి, మైసూరు- చాముండేశ్వరి, మంగళూరు- మంగళాదేవి, ఇక్కడే వెలసిన కుద్రోళి దుర్గాపరమేశ్వరి, కటీలు దివ్యక్షేత్రంలో దుర్గాపరమేశ్వరి, మంగళూరు కద్రి మంజునాథ దేవస్థానపు పార్వతీ దేవి, కొల్లూరు మూకాంబిక, బళ్లారి కనకదుర్గామాత, నంజనగూడు పార్వతీదేవి.. ఇలా అనేక ప్రాంతాలతో పాటు బెంగళూరు బనశంకరి అమ్మవారు, సనాతన కాడుమల్లేశ్వర దేవస్థానపు గౌరీమాత.. ఇలా అనేక కోవెలలో శక్తిమాతలు కొలువుదీరి పూజలందుకుంటున్నారు. తొమ్మిది రోజులూ ప్రధాన అర్చకులు, వేదపండితులు, రుత్వికులు- నవరూపాల్లో అమ్మవార్ని ఆహ్వానించి వైవిధ్యమయ అభిషేకాలు, చండీ హోమాలు, గణపతి పూజలు, నవగ్రహహోమాలు, దుర్గా పారాయణలు, మహిళలచే కుంకుమార్చనలు, విభిన్న అలంకారాల ఆవిష్కరణ తదితరాలు పూర్తి చేయనున్నారు. భక్తి పారవశ్యంతోపాటు నయనానందాన్ని మిగల్చనున్నారు. పుష్పాలంకరణలు, కాయగూరలతో, పట్టుపీతాంబరాలతో పాటు వెండి, బంగారు కవచాలతో అలంకరణలు ప్రత్యేకాంశాలు. ఈ అలంకారాలతోనే అమ్మవార్ల ఊరేగింపులు చేపడతారు. రాష్ట్రమంతా భక్తి వాతావరణం తాండవించనుంది. హరికథలు, సాంస్కృతిక కళా విన్యాసాలు భక్తులకు మనోరంజనాన్ని కలిగిస్తాయి. శైలపుత్రి, బ్రహ్మచారిణి, కూష్మాండ, చంద్రఘంట, స్కంధమాత, చంద్రహాస, మహాకాళి, గౌరి, సిద్ధధాత్రి.. అనే నవ అవతారాల్లో నిత్య పూజలు.. పచ్చతోరణాల మధ్య అమ్మవారు విరాజిల్లనున్నారు.


కటీలు దుర్గాపరమేశ్వరి


హొరనాడు అన్నపూర్ణేశ్వరి


మైసూరు చాముండేశ్వరి


బనశంకరి పరమేశ్వరి


కుద్రోళి దుర్గామ్మ


మంగళూరు మంగళాదేవి


నంజన్‌గూడు పార్వతీదేవి


శక్తిగిరి దుర్గామాత


కాడుమల్లేశ్వర గౌరి

రౌడీషీటరుపై కాల్పులు

హాసన, న్యూస్‌టుడే : పోలీసులపై బాకుతో దాడి చేసి పరారయ్యేందుకు ప్రయత్నించిన మధు అనే రౌడీషీటరుపై పోలీసులు కాల్పులు జరిపి అరెస్టు చేశారు. బేలూరు తాలూకా బిక్కోడు గ్రామంలో గణేశ్ అనే వాటర్‌మెన్‌పై సెప్టెంబరు 14న మధు కత్తితో దాడి చేసి పరారయ్యాడు. దసరా పండగ సమీపిస్తున్న నేపథ్యంలో ఊళ్లోకి మధు తిరిగి వచ్చాడు. ఈ సమాచారాన్ని తెలుసుకుని అతన్ని అరెస్టు చేసేందుకు అరేహళ్లి ఠాణా పోలీసులు బుధవారం గ్రామానికి చేరుకున్నారు. తనను పట్టుకునేందుకు వచ్చిన కానిస్టేబుళ్లు శశి, అశోక్‌లపై బాకుతో దాడి చేసి పరారవుతున్న అతని కాలిపైకి ఇన్‌స్పెక్టర్ వినయ్ తుపాకీతో కాల్చి గాయపరిచారు. కిందపడి దొరికిపోయిన నిందితుడ్ని, కత్తిపోట్లకు గురైన ఇద్దరు కానిస్టేబుళ్లను బేలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బేలూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రేణుకాస్వామి కేసులో ఎట్టకేలకు వారికి మోక్షం

బెంగళూరు (గ్రామీణం) న్యూస్‌టుడే : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో బెయిలు దొరికిన తొమ్మిది రోజుల అనంతరం నిఖిల్, కేశవమూర్తి, కార్తిక్‌లు తుమకూరు కారాగారం నుంచి మంగళవారం సాయంత్రం విడుదలయ్యారు. బెయిలు షరతుల్లో భాగంగా నగదు చెల్లించేందుకు వారి ముగ్గురి కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం సాయంత్రమే అన్ని షరతులను వారు పూర్తి చేశారు. కారాగారంలో ఉన్న సమయంలో తమ కుటుంబ సభ్యులు మినహా తమను పరామర్శించేందుకు ఎవరూ రాలేదని వారు ఆక్రోశించారు. నగదు ఇస్తే ఆర్థిక సమస్యలు తీరిపోతాయని నేరాన్ని తమపై వేసుకుని, ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు.

దళిత సంఘాల ధర్నా


వేదికపై డోలు, తప్పు కొడుతున్న నాయకులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు బెంగళూరులోని ఫ్రీడంపార్కులో ధర్నాకు దిగారు. బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులను ఇతర పథకాలకు మళ్లించకూడదని దళిత సంఘర్ష సమితి నాయకులు డిమాండ్ చేశారు. దళిత సంరక్షణ మహా సమాఖ్య నిర్వహించిన ఆందోళనలో దళిత మఠాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

24న హాసనాంబ దర్శనభాగ్యం

హాసన, న్యూస్‌టుడే : ఏడాదికి ఒకసారి తలుపులు తెరిచే ఆచారం హాసనలోని హాసనాంబ ఆలయంలో కొనసాగుతోంది. చరిత్ర ప్రసిద్ధి ఆలయ తలుపులు ఈ నెల 24న తెరవనున్నట్లు అధికారులు వెల్లడించారు. నవంబరు మూడో తేదీ వరకు మాత్రమే తెరిచి ఉంచుతామని సంబంధిత మంత్రి కేఎన్ రాజణ్ణ తెలిపారు. మొత్తం 11 రోజులు ఆలయాన్ని తెరచి ఉంచినా, భక్తులను తొమ్మిది రోజులు మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. ఈ ఏడాది కనీసం 20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేశారు. గత ఏడాది 16 లక్షల మంది భక్తులు హాసనాంబను దర్శించుకున్నారని తెలిపారు. రూ.300 టికెట్లతో పాటు ఈసారి రూ.వెయ్యి విలువైన టికెట్లను విక్రయిస్తామని చెప్పారు. ఈసారి ఆన్‌లైన్‌లోనూ టికెట్లను కొనుగోలు చేసుకునే అవకాశాన్ని దేవాదాయ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది.


హాసనాంబ దేవాలయం

మత్తు మందు ముఠా అరెస్టు

మంగళూరు, న్యూస్‌టుడే : విద్యార్థులు, యువతకు ఎండీఎంఏ మాత్రలు విక్రయిస్తున్న కేరళకు చెందిన ఐదుగురు నిందితులను సీసీబీ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అబ్దుల్ శాకిర్ (24), హసన్ ఆశీర్ (34), మహ్మద్ నౌషాద్ (22), యాసిన్ ఇమ్రాజ్ (35), ఏకే రియాజ్ (31) అనే వ్యక్తులను నిందితులుగా గుర్తించారు. వీరి నుంచి 70 గ్రాముల ఎండీఎంఏ మాత్రలు, ఐదు చరవాణులు, రూ.1460 నగదు, డిజిటల్ తూనిక యంత్రాన్ని జప్తు చేసుకున్నారు. వీటి విలువను రూ.3.5 లక్షలుగా అంచనా వేశారు. నిందితుల నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు తదుపరి దర్యాప్తును కోణాజె ఠాణా పోలీసులకు అప్పగించారు.

వేధించడంతోనే దాడి

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : వడ్డీ సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ గణేశ్ సిద్ధాపుర అనే వ్యక్తి తన అనుచరులతో కలిసి దాడి చేశాడని ఆరోపించిన వినాయక్ రోణ కేసు కొత్త మలుపు తిరిగింది. గణేశ్ భార్యకు ఫోన్ చేసి అశ్లీలంగా మాట్లాడడం, అశ్లీల చిత్రాలు, వీడియోలు పంపిస్తూ ఉండడంతోనే అతనిపై దాడి జరిగిందని డీసీపీ మహానింగ నందగావి స్పష్టం చేశారు. ఆసుపత్రిలో వినాయక్ రోణ కోలుకుంటున్నాడు. అతనిపై దాడి చేసిన గణేశ్ సిద్ధాపుర, అభిషేక్, యల్లప్ప, మణికంఠ, వరుణ, తిలక్‌లను బెండిగేరి ఠాణా పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు.



బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్- కిలో..రూ.లలో)

బీన్స్-	60
క్యారెట్-	65
బీరకాయలు-	40
క్యాబేజీ-	20
కాలిఫ్లవర్ (ఒక్కోటి)-	20
సొరకాయ-	35
దొడ్డకాయలు-	40
పొట్లకాయ-	35
టమాటా(నాటు)-	48
టమాటా-	45
గుమ్మడి-	40
ఆలుగడ్డ-	40
ఉల్లి (మేలురకం)-	70
ఉల్లి (సాధారణ)	50
వెల్లుల్లి	390
సాంబారు ఉల్లి-	95
బీట్‌రూట్-	25
వంకాయలు-	35
బెండకాయలు-	40
ముల్లంగి-	40
నిమ్మకాయ-	200
వాషింగ్టన్ ఆపిల్	305
సిమ్లా ఆపిల్-	155
గ్రీన్ ఆపిల్-	320
అరటి కాయలు-	45
సపోటా-	55
పైనాపిల్-	38
బొప్పాయి-	44
ఆరంజి-	60
బత్తాయి-	55

అభ్యుదయ భావనలతో ముందడుగు


ప్రతిజ్ఞ పాఠాన్ని చదువుతున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : గాంధీ సర్వోదయ- డాక్టర్ అంబేడ్కర్ అంత్యోదయ భావనలు కర్ణాటక ప్రభుత్వ లక్ష్యాలుగా ఎంచుకున్నట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. మహాత్మ గాంధీ 155వ జయంతి సందర్భంగా బృహత్ బెంగళూరు మహానగర పాలికె బుధవారం విధానసౌధ బ్యాంక్వెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి ప్రారంభించారు. గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పుష్పార్చన చేశారు. గ్రామాలు అభివృద్ధి చెందకపోతే దేశ ప్రగతి అసాధ్యమన్నారు. న్యాయస్థానాలకన్నా ఆత్మసాక్షి ఎక్కువని ఇదే సందర్భంగా పునరుద్ఘాటించారు. ఆత్మసాక్షికి అనుగుణంగా ముందుకు సాగుతున్నామని వ్యాఖ్యానించారు. మహాత్ముడు అనేకానేక సార్లు గ్రామీణ భారతంలో పర్యటించారని, అక్కడి ప్రజల జీవనాన్ని అధ్యయనం చేసి స్వాతంత్ర్య పోరాటాన్ని సాగించారని వివరించారు. ఎన్నో త్యాగాలు చేసి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సామాజిక న్యాయానికి పెద్ద పీట వేసి రాజ్యాంగాన్ని రాశారని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం సామాజిక, ఆర్థిక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నట్లు వివరించారు. గ్యారంటీ పథకాల ద్వారా పేదలు ఆర్థికంగా బలోపేతమవుతున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. గాంధీ జీవితం, చేసిన పోరాటాలపై పాలికె నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మంత్రులు లక్ష్మీ హెబ్బాళ్కర్, హెచ్.కె.పాటిల్, మాజీ కేంద్ర మంత్రి వీరప్పమొయిలీ, ఎమ్మెల్సీ సలీం అహ్మద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, పాలికె చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్, చలనచిత్ర అకాడమీ అధ్యక్షుడు సాధుకోకిల తదితరులు పాల్గొన్నారు.


బాలలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తున్న ముఖ్యమంత్రి

గాంధీ జ్ఞాపకార్థం త్వరలో ప్లీనరీ


కాంగ్రెస్‌భవన్‌లో గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పుష్పార్చన చేస్తున్న సిద్ధు, డీకే తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బెళగావిలో 1924లో మహాత్మాగాంధీ అధ్యక్షతన కాంగ్రెస్ ప్లీనరీ సమావేశం నిర్వహించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబరు ఆఖరి వారంలో బెళగావిలో ప్రత్యేక ఏఐసీసీ సమావేశాన్ని నిర్వహిస్తామని పీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకేశివకుమార్ తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఇక్కడ కాంగ్రెస్ భవన్‌లోని 'భారత్‌జోడో యాత్ర' భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాంధీ, లాల్‌బహుద్దూర్ శాస్త్రి చిత్రపటాలకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో కలిసి ఆయన పుష్పార్చన చేసి ప్రసంగించారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా గాంధీ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు బెళగావిలో ప్లీనరీ నిర్వహించారని వివరించారు. ప్రస్తుతం.. కర్ణాటకకే చెందిన మల్లికార్జున ఖర్గే ఏఐసీసీ అధ్యక్షుడు కావడం ఆనందాన్ని ఇస్తోందన్నారు. ఈసందర్భంగా బెళగావిలోనే ఏఐసీసీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. సమావేశాన్ని విజయవంతం చేసేందుకు సీనియర్ నేతలతో సమితి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ శక్తి.. దేశశక్తిగా వివరించారు. పార్టీకి తనదైన ఘన చరిత్ర ఉందన్నారు. కార్యక్రమంలో మంత్రులు హెచ్.కె.పాటిల్, లక్ష్మీహెబ్బాళ్కర్, ఈశ్వర్ బి.ఖండ్రె తదితరులు పాల్గొన్నారు.

స్నేహమయి కృష్ణకు తాఖీదులు

మైసూరు, న్యూస్‌టుడే : సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణకు జేఎంఎఫ్‌సీ న్యాయస్థానం జామీను రహిత వారెంటు జారీ చేసింది. కుమార్ అనే వ్యక్తి 2015లో చెక్కు బౌన్సు కేసును కృష్ణపై వేశారు. అప్పటి నుంచి విచారణకు హాజరు కాకపోవడంతో న్యాయస్థానం మంగళవారం వారెంటును జారీ చేసింది.

హద్దులు దాటిన అభిమానం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : చిత్రదుర్గ నివాసి రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్ తూగుదీప బళ్లారి కారాగారంలో ఉంటున్నాడు. నిర్దోషిగా ఆయన బయటకు వస్తాడని అభిమానులు మాత్రం ఇప్పటికీ విశ్వసిస్తున్నారు. ఆలయాల్లో పూజలు కొనసాగుతున్నాయి. మైసూరు 'యువ దసరా'లో కొందరు అభిమానులు దర్శన్ ఫొటోలను ప్రదర్శించారు. మరో ఔత్సాహికుడు తాను కొత్తగా కొనుగోలు చేసిన బైకును రాజరాజేశ్వరినగరలోని దర్శన్ ఇంటి బయట నిలబెట్టి.. పూజ చేసుకున్నాడు. ఆ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు.

భాజపా పిలుపుకోసం రఘుపతి ఎదురుచూపు

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : భాజపా నాయకుల నుంచి పిలుపు కోసం వేచి చూస్తున్నానని ఉడుపి మాజీ ఎమ్మెల్యే రఘుపతి భట్ తెలిపారు. పార్టీ ఆదేశాలను ధిక్కరించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడంతో కమలనాథులు ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. తనను పార్టీకి తిరిగి రావాలని సూచిస్తే తక్షణమే భాజపాలో చేరతానని చెప్పారు.

కన్నడనాటా క్షీరమాత!

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : మహారాష్ట్ర తరహాలో కన్నడనాటా గోవును క్షీరమాత అని ప్రకటించాలని భాజపా రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర డిమాండ్ చేశారు. తన ఎక్స్ కార్పెలో దీనికి సంబంధించి ఒక పోస్టు చేశారు. నందిని ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, దాని దృష్టిలో ఉంచుకుని క్షీరమాత లేదా రాష్ట్ర మాతఅని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ట్వీట్ చేశారు.

యత్నాళ్‌పై రేణుకాచార్య నిప్పులు

దావణగెరె, న్యూస్‌టుడే : పంచమసాలి సమాజానికి 2ఏ కేటగిరీ కింద రిజర్వేషన్లు రాకుండా అడ్డుకున్నదే ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ అని మాజీ మంత్రి ఎంపీ రేణుకాచార్య ఆరోపించారు. భాజపా కీలక నేతలు విజయేంద్ర, యడియూరప్పపై విమర్శలు చేస్తే తాను రాష్ట్ర స్థాయిలో నాయకునిగా గుర్తింపు దక్కించుకోవచ్చని యత్నాళ్ త్రిశంకు స్వర్గంలో వేలాడుతున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి పీఠం కోసం భాజపా నాయకులు కొందరు రూ.వెయ్యి కోట్లు జమ చేసుకున్నారని, ఆపరేషన్ కమలకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణలు చేసిన యత్నాళ్ దానికి సంబంధించిన ఆధారాలు చూపించాలని సవాలు విసిరారు.

కాల్పులు జరిపిన యువకుడి అరెస్టు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : తన స్నేహితుడు మొయిన్‌ఖాన్ పుట్టిన రోజుకు తుపాకీతో గాల్లోకి ఆరు రౌండ్లు కాల్చిన సయ్యద్ అల్తాఫ్ అనే యువకుడిని బన్నేరుఘట్ట ఠాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. స్క్రాప్ గోదాములో గత నెల 22న నిర్వహించిన పుట్టిన రోజు వేడుకల్లో నిందితుడు తూటాలు కాల్చాడు. జబేర్ ఖాన్ లిమ్రా అనే వ్యక్తి దాన్ని వీడియో తీసి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్టు చేశాడు. ఆ వీడియోను చూసిన పోలీసులు, స్వయం ప్రేరితంగా కేసు నమోదు చేసుకుని నిందితుడ్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

నడి వీధిలో.. అసభ్యంగా..

బెంగళూరు (మల్లేశ్వరం) : రోడ్డుపై వెళుతున్న ఒక బ్యూటీషియన్‌తో అసభ్యంగా ప్రవర్తించి పరారైన అశోక్‌కుమార్ (36) అనే ఆటో డ్రైవరును మాగడి రోడ్డు ఠాణా పోలీసులు బుధవారం కటకటాల వెనక్కి నెట్టారు. గత నెల 18న ఆమెను వెంబడించుకుని వెళ్లిన నిందితుడు, ఎదురుగా వెళ్లి.. మర్మావయవాలు చూపించి.. అసభ్యంగా వర్తించాడు. ఆమె కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఆమె ఫిర్యాదుతో ఆటో నంబరు ఆధారంగా గాలింపు చేపట్టి అరెస్టు చేశారు. నిందితుడు మల్లేశ్వరం ఠాణా పరిధి వినోబానగర నివాసి అని పోలీసులు తెలిపారు.

కుమార స్వచ్ఛ చైతన్యం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ 155వ జయంతి సందర్భంగా బుధవారం నగరంలోని హెచ్.ఎం.టి. కర్మాగార ప్రదేశంలో భారతీయ విజ్ఞాన సంస్థ ఆవరణలో కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి స్వచ్ఛత పనులు చేపట్టారు. సంస్థ సిబ్బందితో పాటు పారిశుద్ధ్య కార్మికులు వెంటరాగా ఆయన చీపుర్లతో ఆ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. పోగు చేసిన చెత్తను సంచులకు నింపారు. అనంతరం ఆ ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా కుమార మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులకు దూరంగా ఉన్నట్లేనన్నారు. అందరూ పరిశుభ్రతతో పాటు పరిసరాల సంరక్షణ కోసం మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు.


చీపురు పట్టి స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కుమారస్వామి, తదితరులు

యువకుడి సజీవదహనం

బెళగావి, న్యూస్‌టుడే : చిక్కోడి తాలూకా జైనాపుర గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కన ఒక కారు కాలిపోయింది. కారు నడుపుతున్న ఫైరోజ్ బడగావి (38) అనే యువకుడు అందులోనే సజీవ దహనమయ్యాడు. అదనపు ఎస్పీ ఎస్.శ్రుతి, ఎమ్మెల్సీ ప్రకాశ్ హుక్కేరి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. సంఘటనను అవలోకిస్తే కారు కాలిపోయిన అంశంలో పలు అనుమానాలు వస్తున్నాయని హుక్కేరి పేర్కొన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, దర్యాప్తు చేయాలని ఎస్పీ భీమాశంకర్ గుళేద్‌ను కోరారు.


కాలిపోయిన కారు ఇదే

అర్చకుడిపై ఫిర్యాదు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రాజధాని నగరంలోని మైసూరు రోడ్డు గాలి ఆంజనేయ స్వామి ఆలయం అర్చకుడు శ్రీనివాస రామానుజ భట్ వంచనకు పాల్పడిన ఆరోపణలపై బ్యాటరాయనపుర ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆలయంలోని హుండీలకు నగదు వేసే బదులుగా డిజిటల్ నగదు విరాళంగా ఇచ్చేందుకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లపై తన వ్యక్తిగత ఖాతా ఉన్న స్టిక్కర్లను అంటించుకున్నారు. ఆలయ నిర్వహణ సమితి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు కొనసాగించారు.

విద్యార్థినిపై దౌర్జన్యం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : తన అన్న, మేనమామతో కలిసి బయటకు వెళ్లి, మంగళవారం అర్ధరాత్రి దాటిన అనంతరం తిరిగి వచ్చిన కేరళకు చెందిన హృద్య అనే విద్యార్థినిపై పీజీ యాజమాన్య ప్రతినిధులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని చికిత్స కోసం నారాయణ హృదయాలయలో చేర్పించారు. బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న బాధితురాలు గత రెండేళ్లుగా ఆనేకల్‌లోని 'లక్ష్మీ పీజీ కేంద్రం'లో ఉంటోంది. ఊరి నుంచి అన్న, మేనమామ రావడంతో ఆమె బయటకు వెళ్లింది. బయటే భోజనం చేసి వారిద్దరితో కలిసి పీజీ వద్దకు వచ్చింది. చెప్పకుండా బయటకు ఎందుకు వెళ్లావంటూ యజమాని ఆనందరెడ్డి, ఇన్‌చార్జ్ ప్రమోద్ ఆమెపై దాడి చేశారు. అడ్డుపడిన ఆమె సోదరుడినీ కొట్టారు. బాధితురాలి ఫిర్యాదుతో ఆనేకల్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆడపిల్ల పుట్టిందని.. మగబిడ్డ మృతదేహం అప్పగించారు

గంగావతి,న్యూస్‌టుడే: కొప్పళ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్వాకం తల్లిదండ్రులకు శోకాన్ని మిగిల్చింది. ఆడపిల్ల పుట్టిందంటూ చెప్పి ధ్రువీకరణ పత్రం ఇచ్చి వారం రోజుల తరువాత మగపిల్లవాడి మృతదేహాన్ని అప్పగించడాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. కొప్పళ తల్లీబిడ్డల ఆసుపత్రిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. విజయనగర జిల్లా హగరి బొమ్మనహళ్ళికి చెందిన గౌరి అనే ఏడు నెలల గర్భిణికి లోపల నీరు చేరినందున కొప్పళ తల్లీబిడ్డ ఆసుపత్రిలో చేరాలని అక్కడి వైద్యులు సిఫార్సు చేశారు. సెప్టెంబరు 23న ఆమె ప్రసవం కోసం కొప్పళ ఆసుపత్రిలో చేరారు. 25న ఆమె ప్రసవం జరిగింది. ఆడపిల్ల పుట్టింది, బరువు కిలో మాత్రమే ఉంది, కామెర్లు కనిపించడంతో అత్యవసర చికిత్సా విభాగంలో ఉంచాలని వైద్యులు తెలిపినట్లు దంపతులు చెప్పారు. ఏడు రోజుల తరువాత ఫోను చేసి బిడ్డ మృతి చెందింది, మృతదేహం తీసుకెళ్లాలని సమాచారం ఇచ్చారన్నారు. మృతదేహాన్ని మంగళవారం ఇంటికి తెచ్చి చూడగా మగపిల్లవాడు అని గుర్తించినట్లు చెప్పారన్నారు. వారు మృతదేహంతోపాటు ఆసుపత్రికి తిరిగొచ్చి ఆడపిల్ల పుట్టిందంటూ ధ్రువీకరణ పత్రం ఇచ్చి, మగపిల్లవాడి మృతదేహం ఇచ్చారెందుకని? సిబ్బందిని నిలదీశారు. దాఖలాలు పరిశీలించిన సిబ్బంది జరిగిన పొరపాటును గుర్తించారు. పుట్టింది మగపిల్లవాడే ప్రసవం కాగానే మగపిల్లవాడు అని నమోదు చేశామన్నారు. అత్యవసర చికిత్సా విభాగంలో చేర్చేముందు ఆడపిల్లగా నమోదు చేసి పొరపాటు చేసినట్లు వివరణ ఇచ్చారు. దీనిపై దర్యాప్తునకు ఆదేశించినట్లు వైద్యాధికారులు తెలిపారు. తల్లిదండ్రులు దీన్ని అంగీకరించక పోవడంతో నవజాత శిశువు మృతదేహాన్ని శవాగారంలో ఉంచారు. త్వరగా దర్యాప్తు చేసి నిజం ఏమిటో నిరూపించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


కొప్పళ తల్లీబిడ్డల ఆసుపత్రిలో ధ్రువీకరణ పత్రం ప్రదర్శిస్తున్న తల్లిదండ్రులు

బెంగళూరు
•బెంగళూరు •హోసూరు

వైద్య శిబిరం విజయవంతం


శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సీతారామ్, అశోక్ తదితరులు

బెంగళూరు (జాలహళ్లి) : ఇక్కడ కమ్మగుండనహళ్లి అశోక్ పాలిటెక్నికల్ కళాశాల అవరణలో బుధవారం కేబీసీ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఎమ్మెల్సీ ఎం.ఆర్.సీతారామ్, ట్రస్టు ఛైర్మన్ కె.సి.అశోక్ శిబిరాన్ని ప్రారంభించారు. 28 ఏళ్ల నుంచి ఏటా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో గుండె, కిడ్నీ, చర్మం, దంత, కళ్ల పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్, జి.ఎం.లింగరాజు, ప్రముఖులు కె.సి.రోషన్ అశోక్, సుబ్బారెడ్డి, రమేష్, పి.ఎస్. లక్ష్మీనారాయణ, కామత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పితృదేవతలకు తర్పణం



పితృపక్షాల చివరి రోజు పురస్కరించుకుని ప్రజలు తమ పితృదేవతలకు బుధవారం పిండ ప్రదానం చేసి తర్పణాలు విడిచారు. నగరంలోని శ్మశానవాటికలు, ధర్మరాయ ఆలయాల వద్ద పూజలు చేశారు. శ్రీరంగపట్టణ త్రివేణి సంగమం వద్ద వేకువజామునే తర్పణాలు విడిచేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో నదులు, సముద్ర తీరాల వద్ద పిండ ప్రదానం చేశారు.

-న్యూస్‌టుడే, బెంగళూరు (గ్రామీణం)

హోసూరు కబుర్లు



హోసూరులోని గాంధీ విగ్రహం ఎదుట బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో సీఐటీయూ కార్మికులు ధర్నా చేపట్టారు. శాంసంగ్ కార్మికుల కోరికలు తీర్చాలంటూ నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వాసుదేవన్, కార్యదర్శి శ్రీధర్ ఆందోళనకు నేతృత్వం వహించారు. సీపీఎం సీనియరు నాయకులు సేతుమాధవన్, బీజీ మూర్తి, ఆనందకుమార్ తదితరులు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తున్న శాంసంగ్ యాజమాన్యంపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. **-న్యూస్‌టుడే, హోసూరు**

మౌలిక వసతుల కల్పనకు వినతి

హోసూరు, న్యూస్‌టుడే: తమ సమస్యలు తీర్చాలంటూ హోసూరు తాలూకా పూనపల్లి గ్రామస్థులు పంచాయతీ అధ్యక్షురాలు సావిత్రమ్మకు విన్నవించారు. బుధవారం గ్రామంలోని పాఠశాల ఆవరణలో జరిగిన గ్రామ సభలో ప్రజలు పాల్గొని పలు సమస్యలు తెలిపారు. తాగునీరు, రోడ్లు, విద్యుత్తు, డ్రైనేజీ సౌకర్యాలు లేక ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తెలుగు విద్యార్థులకు ఆంగ్లం బోధిస్తున్నారని గ్రామస్థుడు గోపాలరెడ్డి వాపోయారు. తండ్రి మరణాంతరం తన పేరుకు పట్టా మార్పిడి చేశానని, కంప్యూటరులో ఇంకా మార్చలేదన్నారు. డీఎంకే నాయకులు మంజునాథప్ప, పంచాయతీ కార్యదర్శి సుభాషిణి, గ్రామాధికారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు తాలూకాలోని ఆలూరు గ్రామంలో రూ.3.86 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం యూనియన్ వైస్‌ఛైర్మను కె.నారాయణస్వామి భూమిపూజ చేశారు. పంచాయతీ అధ్యక్షురాలు ఉషా, ఉపాధ్యక్షుడు వడ్డల్లియప్ప, వార్డు సభ్యుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి మాట్లాడుతూ పనులు చేపట్టడానికి కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

నర్సింగ్ సేవల వ్యవస్థాపక దినోత్సవం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: మిలటరీ నర్సింగ్ సేవల వ్యవస్థాపక దినోత్సవాన్ని కమాండ్ ఆసుపత్రిలో బుధవారం నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగినితో కలిసి ఎయిర్‌మార్షల్ నాగేశ్‌కపూర్ కేకు కోయించారు. రక్షణ దళాలకు వైద్యసేవలు అందించేందుకు దేశంలో తొలిసారిగా 1926లో మిలటరీ నర్సింగ్ సేవలు బెంగళూరులో ప్రారంభమైనట్లు ఆయన గుర్తుచేశారు. వేడుకల అనంతరం జాతీయ యుద్ధ స్మారకం వద్ద అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. బ్రిగేడియర్ విజయరాణి, విశ్రాంత మేజర్ జనరల్ ఎలిజబెత్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచీ అర్జున్‌కప్ క్రికెట్ పోటీలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో అంబారీ మోసిన ఏనుగు అర్జున స్మారకంగా గురువారం నుంచి అర్జునకప్-2024 క్రికెట్ పోటీలు జరగనున్నాయి. ప్యాంథర్స్ క్రికెట్ అకాడమీ నిర్వహిస్తున్న ఈ పోటీలు ఈ నెల 10 వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. అర్జున జ్ఞాపకార్థం ఏటా దసరా ఉత్సవాల సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. రాజరాజేశ్వరినగరలో ఈ పోటీలు జరగనున్నాయి.

అహింసామూర్తికి ఘన నివాళి


బెంగళూరు: గాంధీ, శాస్త్రిల చిత్రపటాలకు కేంద్ర మంత్రి జోషి, విజయేంద్ర తదితరులు నివాళి


బేరికె: బాగలూరులో ఎంపీ గోపినాథ్, కార్యకర్తల ర్యాలీ


హోసూరులో పూలమాల వేస్తున్న కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ నాయకులు


బెంగళూరు: యలహంక తెలుగు పాఠశాలలో చిన్నారుల నివాళి


బెంగళూరు: గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన చీఫ్ కమిషనర్, మాజీ మేయర్లు

• వాడవాడలా గాంధీ, శాస్త్రిల జయంతి

సత్యం, అహింస, శాంతి మార్గాలతో స్వాతంత్ర్యం సాధించిన మహాత్ముడి అడుగుజాడల్లో అందరూ నడవాలని హోం మంత్రి జి.పరమేశ్వర్ పేర్కొన్నారు. గాంధీ, శాస్త్రి జయంతుల సందర్భంగా తుమకూరులోని అమాని చెరువు ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన గ్యారమూర్తి కళాశిల్పాలను ఆయన కేంద్ర మంత్రి సోమణ్ణతో కలిసి ప్రారంభించారు. బాపూజీ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. బెంగళూరులోని తెలుగు పాఠశాలల్లో చిన్నారులు బాపూజీ చిత్రపటానికి పూలు చల్లి నమస్కరించారు. చిత్రదుర్గం, కోలారు, చిక్కబళ్లాపుర, కృష్ణగిరి, హోసూరు, బేరికె, బాగలూరులో బాపూజీ, శాస్త్రిల జయంతిని ఘనంగా ఆచరించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంస్థల ఆధ్వర్యంలో స్వచ్ఛ పనులు చేశారు. పలువురు వక్తలు గాంధీ, శాస్త్రిల ఆదర్శాలు, ఆశయాల గురించి వివరించారు. **-న్యూస్‌టుడే బృందం**


చిత్రదుర్గంలో మంత్రి సుధాకర్ గాంధీ, శాస్త్రిల చిత్రపటాలకు పుష్పార్చన


పావగడలో పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు


తుమకూరు: బాపూజీ విగ్రహానికి మంత్రి పరమేశ్వర తదితరుల పుష్పార్చన

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత


నటుడు రిషబ్‌శెట్టి, అటవీ సిబ్బందితో కలిసి మంత్రి ఈశ్వర వాకథాన్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: అడవులను నాశనం చేయడం వల్లే వన్యప్రాణులు నగరాలు, పట్టణాల్లోకి వస్తున్నాయని అటవీ శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే అన్నారు. కబ్బన్ ఉద్యానంలో బుధవారం నిర్వహించిన 70వ వన్యప్రాణుల వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అడవులను కాపాడితే వన్యప్రాణులతో సమస్య ఉండదన్నారు. అవి గ్రామాల్లోకి రాకుండా కంచె వేసే ప్రక్రియను పూర్తిచేస్తున్నామన్నారు. జూల్లోని ప్రాణులను దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చారు. తాను మంత్రి పదవి చేపట్టిన తర్వాత ఆక్రమణకు గురైన 4 వేల ఎకరాల అటవీ ప్రదేశాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, నట, దర్శకుడు రిషబ్ శెట్టి, అటవీ సిబ్బందితో కలిసి హైకోర్టు రెండో నంబరు గేటు నుంచి లాల్‌బాగ్ వరకు నిర్వహించిన వాకథాన్‌లో పాల్గొన్నారు.

దసరా కుస్తీ పోటీలకు సర్వం సిద్ధం

బెంగళూరు (క్రీడలు): మైసూరు దసరా ఉత్సవాల్లో ప్రత్యేకత సంతరించుకున్న క్రీడ కుస్తీ పోటీలు. కుస్తీ పోటీల నేపథ్యంలో జంటలు కట్టే ప్రక్రియ ఆసక్తికరంగా జరిగింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి హెచ్.సి.మహాదేవప్ప ప్రారంభించారు. మైసూరు దేవరాజ అరసు క్రీడాప్రాంగణంలో పోటీలు ఈ నెల 3 నుంచి తొమ్మిది వరకు పోటీలు జరగనున్నాయి. కుస్తీతో పాటు పాయింట్ కుస్తీ, పంజాకుస్తీ పురుష, మహిళల విభాగాల్లో జరుగుతాయి. ఈ సందర్భంగా కుస్తీ ఉప సమితి అధికారి నాగేష్ మాట్లాడుతూ ఈ ఏడాది పోటీల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. పదిహేడేళ్ల లోపు విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వస్తు ప్రదర్శన ప్రాధికార అధ్యక్షుడు అయూబ్ ఖాన్, జిల్లాధికారి జి.లక్ష్మీకాంతరెడ్డి, మైసూరు నగర పోలీసు కమిషనర్ సీమాలాట్కర్, డీసీపీలు ముత్తురాజ్, జాహ్నవి, రాష్ట్ర కుస్తీ సంఘం సాంకేతిక అధికారి కె.వినోద్‌కుమార్, సీనియర్ పైల్వాన్లు రంగప్ప, నంజప్ప, సి.రఫీక్, కెంపేగౌడ పి.అమృత పాల్గొన్నారు.

అఖిలభారత చదరంగం పోటీలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: దక్షిణ కన్నడ చదరంగ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అఖిలభారత ఓపెన్ ఫిడే ర్యాపిడ్ రేటెడ్ పోటీలను ఎంఆర్‌పీఎల్ ముఖ్యుడు కృష్ణహెగ్డె, ఆతిథ్య సంఘం అధ్యక్షుడు సునీల్‌ఆచార్ ప్రారంభించారు. మంగళూరు టౌన్‌హాల్‌లో జరిగిన ఈ పోటీలో కర్ణాటక, తెలంగాణ, కేరళ, తమిళనాడు, బిహార్, గోవా తదితర రాష్ట్రాల నుంచి మొత్తం 336 మంది క్రీడాకారులు ఆడుతున్నారు.

మెట్రో రైలు సంచారంలో అంతరాయం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ఉత్తర-దక్షిణ ఆకుపచ్చ మెట్రో కారిడార్ మార్గంలోని నాగసంద్ర నుంచి మాదావర పొడిగింపు మార్గాన్ని గురువారం కేంద్ర మెట్రో రైలు సురక్షిత కమిషనర్ తనిఖీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో 3న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నాగవార-పీణ్యా ఇండస్ట్రియల్ మెట్రోస్టేషన్ వరకు రైలు సంచారం ఉండబోదని బీఎంఆర్‌సీఎల్ అధికారులు తెలిపారు. ప్రయాణికులు పీణ్యా స్టేషన్ నుంచి సంచరించాలని సూచించారు.

అమెజాన్ పండగకు భారీ స్పందన

బెంగళూరు (యశ్వంతపుర): అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్‌కు వినియోగదారుల నుంచి భారీ స్పందన వచ్చిందని ఆ సంస్థ ఉపాధ్యక్షుడు సౌరభ్ శ్రీవాస్తవ తెలిపారు. పండగ మొదలైన 48 గంటల్లో 11 కోట్ల వినియోగదారులు కొనుగోళ్లు చేశారన్నారు. ఎలక్ట్రానిక్‌తో పాటు హస్తకళ, చేనేత వస్త్రాలు, వస్తువుల కొనుగోలుకు పోటీ పడుతున్నారని ఆయన వెల్లడించారు.



బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు

స్వయం ఉపాధితో ఆర్థిక సంక్షేమం

రాయచూరు, న్యూస్‌టుడే : ఆర్థిక సబలీకరణకు యువత స్వయం ఉపాధి పనుల వైపు మొగ్గు చూపాలని సోలార్ సేల్కో ఇండియా సేల్స్ ఎగ్జిక్యూటివ్ అధికారి కాశీనాథ్ గోర్కల్ మఠ కోరారు. రాష్ట్ర సహకార మహా మండలి, జిల్లా సహకార ఒక్కూట, ప్రాథమిక సహకారం సంఘం (అరికెర) సంయుక్తంగా బుధవారం దేవదుర్గ తాలూకా అరకేరాలో సహకార మండలి సభ్యులకు స్వయం ఉపాధిపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఒక్కూట ప్రతినిధి మంజుళా మాట్లాడుతూ సహకార సంఘంలో రైతులకు ఉన్న పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. రుణాలను సకాలంలో చెల్లించే కొత్త రుణాలు పొందాలని సలహా ఇచ్చారు. అరకేరా ప్యాక్స్ సంఘం అధ్యక్షుడు నాగప్ప, శివకుమార్ పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు దేవాలయాల ముస్తాబు

రాయచూరు : నగరంలో దసరా నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు ముగిశాయి. నేటి నుంచి 11వ తేదీ వరకు వేడుకలు జరగనున్న విషయం తెలిసిందే. దేవాలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్తు దీపాలతో అలంకరించారు. గద్వాల్ రహదారిలోని మాతా మహాలక్ష్మి, మాతా కాళికాదేవి ఆలయాల్లో ఘనంగా నిర్వహిస్తామని మున్నూరు కాపు సమాజం వెల్లడించింది. ఉస్సారవాడిలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని రోజూ రాత్రి ఒక్కో వాహనంపై పుర వీధుల్లో ఊరేగిస్తారు. తిమ్మాపూర పేటలోని తిమ్మప్ప ఆలయంలో ఉత్సవాలు గురువారం బ్రహ్మ మూహూర్తంలో మొదలవుతాయని నిర్వాహకులు వెల్లడించారు. ముత్యాలమ్మ, కందగడ్డ మారెమ్మ, భవానీ, మారెమ్మ, తాయమ్మ దేవస్థానాల్లో ఉత్సవాలకు ముస్తాబయ్యాయి.

గాంధీ సందేశాలు అనుసరణీయం



మహాత్మునికి నివాళులు అర్పించిన మంత్రి, ఎంపీ, అధికారులు

రాయచూరు, న్యూస్‌టుడే : గాంధీ సందేశాలైన సత్యం, శాంతి, అహింసా పద్ధతులు అనుసరణీయమని, ప్రపంచానికి మార్గదర్శకంగా మారాయని మంత్రి బోసురాజు పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడి క్రీడా మైదానం దగ్గరలోని గాంధీ విగ్రహం వద్ద మహాత్ముడి జయంతిని ఆచరించారు. మంత్రి బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ బానిస సంకెళ్ల నుంచి భరతమాత విముక్తి పొందేందుకు స్వాతంత్య్ర పోరాట పథాన్ని మార్చిన ఘనత గాంధీకే దక్కిందని తెలిపారు. ఆయన పిలుపు మేరకు లక్షలాది మంది స్పందించి ఉద్యమ బాటలో నడిచారని చెప్పారు. గాంధీ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఎందరో యోధులు జీవితాలను త్యాగం చేశారన్నారు. ఆయన దేశభక్తి, నిరాడంబరతను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. స్వచ్ఛ భారత్ కోసం ఆయన కన్న కలలను సాకారం చేద్దామని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దేశభక్తిపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీ కుమారనాయక్, జిల్లా పాలనాధికారి నితీష్, జడ్పీ సీఈవో రాహుల్, ఎస్పీ పుట్ట మాదయ్య, జిల్లా అదనపు పాలనాధికారి శివానంద, నగరసభ అధ్యక్షురాలు నరసమ్మ, తహసీల్దార్ సురేష్ వర్మ, నగరసభ కమిషనర్ గురుసిద్దయ్య పాల్గొన్నారు.

రాయచూరు : నగరంలో వివిధ ప్రాంతాల్లో మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. జిల్లా పాలనాధికారి సభాభవన్‌లో జాతిపిత చిత్రపటానికి జిల్లా పాలనాధికారి నితీష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మహాత్ముడి అడుగుజాడల్లో నడవాలని, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుకోవాలన్న బాపు సూచనలను పాటిస్తే రాయచూరు పరిశుభ్రంగా మారుతుందన్నారు. అనంతరం క్రీడా మైదానం వరకు నిర్వహించిన స్వచ్ఛతా నడక జాతాలో జడ్పీ సీఈవో రాహుల్, ఎస్పీ పుట్ట మాదయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.



రాయచూరు : మహిళలను సత్కరిస్తున్న ప్రముఖులు

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో..

వ్యవసాయ విశ్వవిద్యాలయం సభాభవన్‌లో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని ఆచరించారు. ఉపకులపతి డాక్టర్ హనుమంతప్ప మహనీయుల చిత్రపటానికి పూలమాలలు వేశారు. గాంధీ నేతృత్వంలో దేశానికి స్వాతంత్య్రం లభించిందని, ప్రధానిగా లాల్ బహదూర్ తీసుకున్న నిర్ణయాలతో వ్యవసాయ రంగం విప్లవాత్మక మార్పులు సాధించిందని వివరించారు. ఈ సందర్భంగా నేతాజీనగర్ సహకార సేవా సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సాధన కనబరుస్తున్న మహిళలను సత్కరించారు. కన్నడ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కసాప తాలూకా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ శాంతి సౌహార్ద్రతతో, కలిసి మెలిసి జీవించాలన్న గాంధీ బోధనలను అనుసరిద్దామన్నారు. కార్యదర్శి రాఘవరావ్ బరూర, సంఘటనా కార్యదర్శి నాగప్ప తదితరులు హాజరయ్యారు. వాసవి క్లబ్ నిర్వహించిన వేడుకల్లో అధ్యక్షుడు గాణదాళ్ తిప్పయ్య మాట్లాడుతూ మహానుభావుల గొప్పతనాన్ని ఒక రోజు స్మరించుకుంటే సరిపోదన్నారు. వారు దేశానికి చేసిన సేవలను ఏడాది పొడవునా జ్ఞాపకం చేసుకోవాలని కోరారు.



మాన్వి : పంపా పార్కులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

మాన్వి : జాతిపిత మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీల జయంత్యుత్సవాలను మాన్వి, సిరివార, లింగసుగూరు తాలూకాల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో పంపా పార్కులో సర్వధర్మ సమ్మేళనం ఆచరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హంపయ్య నాయక్‌తో పాటు పలువురు వక్తలు గాంధీ, శాస్త్రిల త్యాగాలు, దేశం కోసం వారు పడిన కృషిని ప్రస్తుతించారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు లక్ష్మీ వీరేశ్, కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఈరణ్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గఫూర్ సాబ్, పురపాలక సంఘం ప్రధాన నాయకుడు మహేంద్రనాయక్, తహసీల్దార్ రాజు ఫిరంగి, ముఖ్యాధికారి గంగాధర్, పురపాలక సంఘం సభ్యులు, మత పెద్దలు, అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

పట్టణంలోని వాల్మీకి క్రాస్ నుంచి కాంగ్రెస్ కార్యాలయం వరకు పార్టీ ఆధ్వర్యంలో జయంత్యుత్సవ ఊరేగింపు నిర్వహించారు. కూడలి నుంచి ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పాదయాత్ర చేశారు. కార్యాలయంలో గాంధీ, శాస్త్రి చిత్ర పటాలకు నివాళులర్పించారు. పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింధనూరు : మహాత్ముని సారథ్యంలో అఖిల భారత కాంగ్రెస్ సమితి సమావేశానికి వంద ఏళ్ల అయిన సందర్భంగా ఏడాది పొడవునా ఆయన్ను గౌరవంగా స్మరించుకుంటూ.. కార్యక్రమాలు చేపడదామని తాలూకా కాంగ్రెస్ అధ్యక్షుడు శివకుమార్ జవళి కార్యకర్తలను కోరారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు వంద అడుగుల జాతీయ పతాకాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. స్థానిక గాంధీ కూడలికి చేరుకుని మహాత్ముని విగ్రహానికి నివాళులు అర్పించారు. కుమార్ జవళి, సోమనగౌడ బాదర్లి, వెంకటేశ్ రాగలపర్వి పాల్గొన్నారు. ఎమ్మెల్యే బాదర్లి, మాజీ మంత్రి నాడగౌడ, మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప పాల్గొన్నారు.



రాయచూరు: గాంధీకి నమస్కరిస్తున్న జిల్లా పాలనాధికారి



సింధనూరులో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్‌భవన్‌లో గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పుష్పార్చన చేస్తున్న సిద్ధు, డీకే తదితరులు

'బెళగావిలో త్వరలో ప్లీనరీ'

బెంగళూరు (యశ్వంతపుర): బెళగావిలో 1924లో మహాత్మాగాంధీ అధ్యక్షతన కాంగ్రెస్ ప్లీనరీ సమావేశం నిర్వహించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబరు ఆఖరి వారంలో బెళగావిలో ప్రత్యేక ఏఐసీసీ సమావేశాన్ని నిర్వహిస్తామని పీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకేశివకుమార్ తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఇక్కడ కాంగ్రెస్ భవన్ లోని 'భారత్‌జోడో యాత్ర' భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో కలిసి ఆయన పుష్పార్చన చేసి ప్రసంగించారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా గాంధీ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు బెళగావిలో ప్లీనరీ నిర్వహించారని వివరించారు. ప్రస్తుతం.. కర్ణాటకకే చెందిన మల్లికార్జున ఖర్గే ఏఐసీసీ అధ్యక్షుడు కావడం ఆనందాన్ని ఇస్తోందన్నారు. ఈసందర్భంగా బెళగావిలోనే ఏఐసీసీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ శక్తి.. దేశ శక్తిగా వివరించారు. పార్టీకి తనదైన ఘన చరిత్ర ఉందన్నారు. కార్యక్రమంలో మంత్రులు హెచ్.కె.పాటిల్, లక్ష్మీహెబ్బాళ్కర్, ఈశ్వర్ బి. ఖండ్రె తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరులో భూమి, వసతి వంచితుల సమావేశం



పాత్రికేయులతో మాట్లాడుతున్న మారెప్ప, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : అన్నదాతలకు సాగు భూమి మంజూరు చేయాలని, పేదలకు ఇళ్లు కట్టించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 5న బెంగళూరు గాంధీభవన్‌లో భూమి, వసతి వంచితుల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పోరాట సమితి సంచాలకుడు మారెప్ప హరవి వెల్లడించారు. రెవెన్యూ మంత్రి కృష్ణ భైరేగౌడ, దళిత సంఘర్షణ సమితి ప్రముఖుడు వెంకటేష్, ప్రగతిపరులు విజయమ్మను ఆహ్వానించినట్లు తెలిపారు. ఆయన బుధవారం పత్రికాభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని జిల్లాలో అనేక పోరాటాలు చేసినా సరైన రీతిలో స్పందన దొరకలేదని వాపోయారు. గతంలో సిద్ధరామయ్య సీఎంగా ఉన్నప్పుడు ఉన్నత స్థాయి సమితిని నియమించారని చెప్పారు. ఆ తర్వాత భాజపా సర్కార్ భూమి చట్టంలో మార్పులు తెచ్చిందే కానీ అమలు చేయలేదన్నారు. ఫలితంగా దశాబ్దాలుగా పోడు, అటవీ భూములను సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విధానసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని అగ్ర నేతలు హామీ ఇచ్చారని, పాలనా పగ్గాలు చేపట్టి ఏడాదిన్నర అవుతున్నా. . భరోసాను నిలబెట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటకారుడు ఎం.ఆర్.భేరి మాట్లాడుతూ ఎమ్మెల్యే అధ్యక్షతన ఏర్పడిన అక్రమ, సక్రమ సమితులు నిష్ప్రయోజనంగా మారాయని మండిపడ్డారు. ఆక్రమాల పేరిట భూములను ఖాళీ చేయిస్తూ రైతులను రోడ్డు పాలు చేస్తున్నారని వాపోయారు. సమావేశంలో ప్రతినిధులు ఖాజా అస్లాం, ఆంజనేయ కురుబదొడ్డి, గోవింద పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : మంత్రి



ఉపాధ్యాయులతో మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్, తదితరులు

మాన్వి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ప్రైవేట్ విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి ఎన్.ఎస్. బోసురాజు హామీ ఇచ్చారు. బుధవారం తాలూకా ప్రైవేట్ శిక్షణ సంస్థ ఒక్కూట ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం, ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రప్రథమంగా రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా అరకెరాలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, సీఎంతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్ మాట్లాడుతూ శిక్షణ విషయంలో ప్రైవేట్, ప్రభుత్వ అనే తేడాలేదన్నారు. ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయులకు అందిస్తున్నట్లే ప్రైవేట్ ఉపాధ్యాయులకు కూడా బంగారు పతకాలు అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యేలు బసనగౌడ బ్యాగవాట్, గంగాధర్‌నాయక్, రాజా వెంకటప్పనాయక్, ఒక్కూట అధ్యక్షుడు హెచ్.శర్ఫుద్దీన్ మాట్లాడారు. కార్యక్రమంలో కల్మఠ విరూపాక్ష పండితారాధ్య స్వామీజీ, క్షేత్ర శిక్షణాధికారి చంద్రశేఖర్, కురుబ సంఘం అధ్యక్షుడు ఎం.ఈరణ్ణ, సయ్యద్ అక్బర్‌పాషా, వీరేశ్, కేశవరెడ్డి, ఈరణ్ణ మర్లట్టి, రాజు తాళికోటె, సణ్ణబసనగౌడ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

5న బీమా ఉద్యోగుల సమ్మేళనం



విలేకర్లతో మాట్లాడుతున్న రవి, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : జీవిత బీమా ఉద్యోగుల సంఘం 33వ మహా సమ్మేళనాన్ని ఈ నెల 5న స్థానిక స్టేషన్ రహదారిలోని కొఠారి భవనంలో నిర్వహిస్తామని రాయచూరు బీమా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.రవి వెల్లడించారు. ఆయన బుధవారం పత్రికాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. రాయచూరు ఎల్ఐసీ విభాగం పరిధి ఏడు జిల్లాల్లోని 16 శాఖల్లో పనిచేస్తున్న 250 మందికి పైగా ఉద్యోగులు హాజరవుతారని వెల్లడించారు. అఖిల భారత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా సమ్మేళనాన్ని ప్రారంభిస్తారని, వలయ స్థాయి ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ విచ్చేస్తారని, రాయచూరు సంఘం అధ్యక్షుడు శరణే గౌడ అధ్యక్షత వహిస్తారని వివరించారు. బీమాపై జీఎస్టీని రద్దు చేయాలని, షేర్ మార్కెట్‌లో సొమ్మును పెట్టవద్దని, నిత్యావసర వస్తువుల ధరలకు కళ్లెం వేయాలని, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తామని విపులీకరించారు. సమావేశంలో ప్రతినిధులు శ్రీధర్, కృష్ణమూర్తి, వీరేశ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



యమునప్ప

మాన్వి, న్యూస్‌టుడే : తాలూకాలోని జీనూరుక్యాంపులో యమునప్ప (35) అనే రైతు అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకొన్నట్లు పోలీసులు తెలిపారు. పోత్నాళలోని ప్రగతి గ్రామీణ బ్యాంకులో రూ.3 లక్షల పంట రుణాలు తీసుకున్నాడు. పంటలు పండకపోవటంతో అప్పులు తీర్చలేకపోయాడు. చేసిన అప్పు తీర్చలేనన్న భయంతో మంగళవారం రాత్రి ఇంటి బయట ఇనుప గ్రిల్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. యమునప్ప భార్య గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తుంగభద్ర కాలువకు శాశ్వత పరిష్కారం చూపాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు బసనగౌడ, గంగాధర్‌నాయక్

మాన్వి, న్యూస్‌టుడే : తుంగభద్ర ఎడమ కాలువ సమస్యకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శాశ్వత పరిష్కారం చూపాలని మాజీ ఎమ్మెల్యేలు బసనగౌడ బ్యాగవాట్, గంగాధర్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పత్రికా భవనంలో పార్టీ తాలూకా అధ్యక్షుడు జాలాది సుధాకర్‌తో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 5న మాన్వికి వస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించనున్నట్లు చెప్పారు. సీఎం నుంచి సరైన సమాధానం రాకుంటే అక్కడే ధర్నా చేస్తామని తెలిపారు. గంగాధర్‌నాయక్ మాట్లాడుతూ ఈ సమస్యను అన్ని ప్రభుత్వాలూ విస్మరించాయన్నారు. జిల్లాలకు ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ నీటి సమస్య పరిష్కారం కాలేదన్నారు. నీటిపారుదల శాఖపై అనుభవమున్న బోసురాజు తాలూకాలో ఒక్క పథకాన్ని కూడా చేపట్టలేదన్నారు. సమావేశంలో జగదీశ్ ఓతూరు, వీరభద్రగౌడ, గురుసిద్ధప్ప, అయ్యప్పనాయక్ మేకల్, రామనగౌడ, కుమారస్వామి, విరూపాక్షగౌడ తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ కోసం వినూత్న రీతిలో ఆందోళన

రాయచూరు, న్యూస్‌టుడే : ఎయిమ్స్ కోసం ఉద్యమబాట పట్టిన సాధనా సమితి గాంధీ జయంతి రోజు వినూత్న రీతిలో డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. వెంకటరెడ్డి దిన్ని అనే వ్యక్తికి గాంధీ వేషం వేయించి ప్రముఖ రహదారుల్లో పాదయాత్ర చేపట్టారు. 874 రోజులుగా చేస్తున్న నిరవధిక ఆందోళనను గంభీరంగా తీసుకోవాలని ఒత్తిడి చేయటానికి విభిన్న రీతిలో ప్రదర్శన నిర్వహించినట్లు సంచాలకుడు బసవరాజ కళస తెలిపారు. మహాత్ముడి సత్యాగ్రహం బాటలోనే శాంతియుతంగా ఆందోళన చేస్తున్నామని వివరించారు. ఎయిమ్స్ మంజూరు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమితి సభ్యులు అశోక్‌కుమార్ జైన్, జాన్‌వెస్లీ, జశవంతరావ్ కల్యాణకారి, శ్రీనివాస ఆచారి జోషి, వీరభద్రయ్య స్వామి పాల్గొన్నారు.



ఆకట్టుకొన్న గాంధీ వేషధారణ

హట్టి 'బంగారు'కు మంచి రోజులు



హట్టిలోని పరిశ్రమ ప్రధాన కార్యాలయం

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు జిల్లా లింగసూగూరు తాలూకాలోని హట్టి బంగారు గనుల కంపెనీ మేలిమి బంగారం తయారీలో దేశ వ్యాప్త గుర్తింపు పొందింది. కంపెనీని మరింత అభివృద్ధి పరిచేందుకు సిద్ధరామయ్య ప్రభుత్వం ప్రత్యేక ఆసక్తి తీసుకుంది. గత నెలలో కలబురగిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో విస్తరణ పనులు, క్యాంప్‌లో సమగ్ర ప్రగతి పనులకు రూ.998 కోట్లను కేటాయించింది. భారీ మొత్తంలో నిధులు సమకూర్చడంతో హట్టిలో ప్రగతి పరుగులు తీయనుంది. దీని పరిధిలోని హీరాబుద్దిన్ని గనిలో శాఫ్ట్‌ను అమర్చేందుకు, ఐదో దశ నుంచి 11వ దశ వరకు విస్తరణ పనుల కోసం రూ.175.74 కోట్లు వ్యయం చేస్తారు. ప్రస్తుతం 187.60 మీటర్ల లోతు వరకు తవ్వకాలు చేస్తున్నారు. విస్తరణ వల్ల 190.90 మీటర్ల వరకు లోపలకు వెళతారు. తద్వారా అదనంగా 75 వేల టన్నుల ముడి సరకు లభ్యం కానుంది. ఒక టన్నును సంస్కరిస్తే 2.35 గ్రాముల బంగారం లభిస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో గ్రాము బంగారం ధర రూ.7200 ఉంది. ఏడాదికి కంపెనీకి రూ.76.67 కోట్ల ఆదాయం వస్తుందని అధికారుల అంచనా వేశారు. విస్తరణతో చుట్టు పక్కల గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

గృహాల పునర్నిర్మాణం

నాలుగు వేల మంది కార్మికులు 2701 ఇళ్లలో నివసిస్తున్నారు. వీటిలో చాలా ఇళ్లు శిథిలమయ్యాయి. మరమ్మతులు చేస్తున్నా ప్రయోజనం ఉండటం లేదు. దాంతో శాశ్వత కొత్త గృహాలు నిర్మిస్తారు. టౌన్‌షిప్‌లో మొత్తం 57 బ్లాకుల్లో ఇళ్ల నిర్మాణం జరగనుంది. 130 పడకల ఆసుపత్రిని కడతారు. క్యాంపులో మౌలిక వసతులు సమకూరుస్తారు. ప్రజాపనుల శాఖ ప్లానింగ్, రోడ్ అసెట్ మేనేజమెంట్ సెంటర్ ఆధ్వర్యంలో పనులు జరుగుతాయి. విస్తరణ, గృహ నిర్మాణ పనుల ప్రణాళికతో రెండేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపారు. మంత్రివర్గ సమావేశం జరగడంతో ఎమ్మెల్యేలు ఒత్తిడి మేరకు ఆమోదం తెలిపారు.